
Email : telanganaveenaofficial@gmail.com

Title Code : 12280

# తెలంగాణ వీణ

నిజం నిగ్గు తేలుద్దాం..

సంపుటి : 1 సంచిక : 89 హైదరాబాద్ మంగళవారం 12 - 12 - 2023 పేజీలు : 8 వెల : రూ. 4/-




# రైతుబంధు నిధులు విడుదల చేయండి

## - సీఎం ఆదేశాలు



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** తెలంగాణ ప్రభుత్వం రైతులకు శుభవార్త అందించింది. రైతులకు పెట్టుబడి సాయం అందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. వెంటనే చెల్లింపులు ప్రారంభించాలని సూచించారు. ఇప్పటికే ట్రెజరీలో ఉన్న నిధులను విడుదల చేయాలని సీఎం స్పష్టం చేశారు.తెలంగాణ ప్రభుత్వం రైతులకు శుభవార్త అందించింది. రైతులకు పెట్టుబడి సాయం అందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. వెంటనే చెల్లింపులు ప్రారంభించాలని సూచించారు. ఇప్పటికే ట్రెజరీలో ఉన్న నిధులను విడుదల చేయాలని సీఎం స్పష్టం చేశారు. గతంలో మాదిరిగా రైతులకు ఈ చెల్లింపులు చేయాలని అధికారులను కోరారు. అయితే కాంగ్రెస్ మేనిఫెస్టోలో ప్రకటించిన రైతు భరోసా పథకానికి ఇంకా విధి విధానాలు ఖరారు కాకపోవడంతో సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తుతానికి గతంలో ఉన్న రైతుబంధు పథకం లబ్ధిదారులకు పెట్టుబడి సాయం అందించాలని నిర్ణయించారు. అటు రూ.2 లక్షల మేరకు రుణమాఫీపై కార్యాచరణ, ప్రణాళిక రూపొందించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు జారీ చేశారు.కాగా తెలంగాణ ఎన్నికలకు ముందే రైతు బంధు సాయం రైతులకు అందాల్సి ఉంది. కానీ అప్పటికే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో రైతుబంధు పథకం అమలును ఈసీ నిలిపివేసింది. తర్వాత అనుమతి ఇచ్చినప్పటికీ బీఆర్ఎస్ నేతలు ఎన్నికల కోడ్ ఉల్లంఘించి చేసిన కామెంట్ల కారణంగా ఈసీ రైతుబంధును నిలిపివేయాలని ఆదేశాలు జారీ చేసింది. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులకు సాయం అందిస్తామని రేవంత్ మాట ఇవ్వడంతో తాజాగా ఆయన ఆదేశాలు జారీ చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను చంద్రబాబు పరామర్శ



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** తుంటి ఎముక మార్పిడికి శస్త్ర చికిత్స చేయించుకుని యశోదా ఆస్పత్రిలో కోలుకుంటున్న మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను టీడీపి అధినేత చంద్రబాబు నాయుడు పరామర్శించనున్నారు. సోమవారం మధ్యాహ్నం మూడున్నర గంటల సమయంలో కేసీఆర్‌ను చంద్రబాబు పరామర్శిస్తారు.

# స్పీకర్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** తెలంగాణ శాసనసభ స్పీకర్ ఎన్నిక కోసం నోటిఫికేషన్ విడుదలైంది. సోమవారం ఉదయం అసెంబ్లీ సెక్రటేరియట్ స్పీకర్ ఎన్నిక నోటిఫికేసన్ కు ఉత్తర్వులు జారీ చేసింది. డిసెంబర్ 13వ తేదీ ఉదయం 10.30 నుండి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్ వేసేందుకు గడువు ఇచ్చింది. ఇప్పటికే కాంగ్రెస్ సీనియర్ నాయకుడు గడ్డం ప్రసాద్ కుమర్‌ను శాసన సభ స్పీకర్‌గా కాంగ్రెస్ అధిష్టానం ఖరారు చేసిన విషయం తెలిసిందే.ఆయన ఒక్కరే నామినేషన్ వేయనున్నట్లు తెలుస్తోంది. అనంతరం ఏకగ్రీవంగా గడ్డం ప్రసాద్ ను స్పీకర్ గా ఎన్నుకోనున్నారు. కిరణ్ కమార్ రెడ్డి మంత్రి వర్గంలో గడ్డం ప్రసాద్ టైక్స్‌టైల్ మంత్రిగా పని చేశారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గడ్డం ప్రసాద్ వికారాబాద్ నుంచి ఎంఎల్ఏగా గెలుపొందారు.

# దేశంలో మళ్లీ పెరుగుతున్న కరోనా కేసులు...



**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:** దేశంలో మళ్లీ కరోనా పంజా విసురుతోంది. మహమ్మారి కరోనాతో ప్రపంచం మొత్తం స్తంభించిపోయిన విషయం తెలిసిందే. ఈ కరోనా వైరస్ అంతమొందించడానికి ప్రపంచ దేశాలు పలు వ్యాక్సిన్లను తీసుకొచ్చారు. ఆ తర్వాత తగ్గు ముఖం పట్టిన కరోనా కేసులు మళ్లీ పెరుగుతుండడం ఆందో ళన కలిగిస్తోంది. భారత్ లో గడిచిన 24 గంటల్లో 166 కొత్త కరోనా కేసులు బయటపడ్డట్లు కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది.ఇందులో అధిక కేసులు ఒక్క కేరళలోనే నమో దు కావడం కలకలం రేపుతోంది. తాజా కేసులతో కలిపి దేశంలో మొత్తం యాక్టీవ్ కేసుల సంఖ్య 895కు చేరింది. చలికాలం కావడంతో కరోనా కేసులు పెరిగే అవకాశం ఉందని ఆరోగ్య శాఖ అధికారులు అభిప్రాయపడుతున్నారు. దేశంలో కరోనా కేసులు పెరుగుతుండడంతో కేంద్రం రాష్ట్రాలను అప్రమత్తం చేసింది.

# సుప్రీంతీర్పు ఓ ఆశాకిరణం ప్రధాని మోడీ హర్షం



**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:** జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన ఆర్టికల్ 370 రద్దు రాజ్యాంగ బద్ధమేనంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై ప్రధాని నరేంద్ర మోడీ హర్షం వ్యక్తం చేశారు. ఇది ప్రజల ఐక్యత, ఆశలు, పురోగతిని ప్రతిధ్వనించే చారిత్రక తీర్పు అని కొనియాడారు. ‘ ఆర్టికల్ 370 రద్దుపై సుప్రీంకోర్టు తీర్పు చారిత్రాత్మకం. 2019 ఆగస్టు 5న పార్లమెంటు తీసుకున్న నిర్ణయాన్ని కోర్టు రాజ్యాంగబద్ధంగా సమర్థించింది. జమ్మూ కశ్మీర్, లడఖ్ సోదర సోదరీమణుల ఆశలు, ఐక్యత, పురోగతిని ప్రతిధ్వనించే ప్రకటన ఇది. భారతీయులుగా మనమెంతో గర్వపడే ఐక్యతను సుప్రీంకోర్టు మరోసారి బలపర్చింది. జమ్మూ కశ్మీర్, లడఖ్ ప్రజల కలలను నెరవేర్చేందుకు మేం నిబద్ధతతో ఉన్నాం. ఆర్టికల్ 370తో నష్టపోయిన వారందరికీ అభివృద్ధి ఫలాలను అందిస్తాం.ఈ రోజు తీర్పు కేవలం చట్టపరమైనదే కాదు,.. రానున్న తరాలకు ఇదో ఆశాకిరణం. ఉజ్వల భవితకు వాగ్దానం. బలమైన ఐక్య భారత్‌ను నిర్మించాలనే మన సంకల్పానికి నిదర్శనం’ అని ప్రధాని ఎక్స్ వేదికగా చేసిన ఓ ట్వీట్‌లో ఆనందం వ్యక్తం చేశారు.

# వందేళ్లు ఉండాల్సిన ప్రాజెక్టు మూడేళ్లకే దెబ్బతినడమేంటి?: ఉత్తమ్



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** తెలంగాణ ప్రజలను మార్టిగేజ్ చేసి రుణాలు తీసుకవస్తున్నామని భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. నీటి పారుదల ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సమీక్షలు జరిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై ప్రత్యేకంగా సమీక్ష చేస్తానని మంత్రి పేర్కొన్నారు. సిడబ్లుసి అనుమతి లేకుండా ప్రాజెక్టులు ఎలా చేపడుతారని మంత్రి ప్రశ్నించారు. నిధులు ఎలా సమీకరించారని అధికారులను మంత్రి అడిగారు. ప్రాజెక్టు పనులపై థర్డ్ పార్టీ చెకింగ్ లేదా అని ప్రశ్నించారు. కాళేశ్వరం నిర్మాణానికి సిడబ్లుసి అనుమతి ఉందని అధికారులు వెల్లడించారు. పాత ఆయకట్టును కొత్త ఆయకట్టులో ఎందుకు చూపుతున్నారని మంత్రి ప్రశ్నించడంతో అధికారులు అవాక్కయ్యారు. వర్షాలు వచ్చినప్పుడు నీరు లిఫ్ట్ చేయాల్సిన అవసరం లేదన్నారు. ఖర్చు పెడుతున్న మొత్తానికి లబ్ధి ఉండేలా బేరీజు వేసుకోవాలని, వందేళ్లు ఉండాల్సిన ప్రాజెక్టు మూడేళ్లకే దెబ్బతినడం ఆందోళనకరమైన విషయమని ఉత్తమ్ మండిపడ్డారు.మేడిగడ్డ ప్రాజెక్టు పిల్లర్లు కుంగడంపై వివరణ ఇవ్వాలని అధికారులను మంత్రి అడిగారు. మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణానికి రూ.4600 కోట్లు ఖర్చు జరిగిందని ఇఎన్‌సి మురళీధర్ రావు తెలిపారు. ఒక పిల్లర్ 1.2 మీటర్ల మేర కుంగడంతో మరో మూడు పిల్లర్లపై ప్రభావం పడిందన్నారు. పిల్లర్లు కుంగిన వెంటనే ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేశామని, నీరు తొలగించిన తరువాత పిల్లర్లు కుంగడం ఆగిందని మురళీధర్ రావు చెప్పారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు.మేడిగడ్డ ప్రాజెక్టు పిల్లర్లు కుంగటం చాలా తీవ్రమైన అంశం అని, త్వరలో మేడిగడ్డ ప్రాజెక్టును సందర్శిస్తానని, మేడిగడ్డ నిర్మించిన ఏజెన్సీ, అధికారులు తనతో ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. మేడిగడ్డ బ్యారేజీకి ఎంత ఖర్చు చేశారో లెక్కలు తేలాలన్నారు. ఎంత ఆయకట్టుకు నీరు ఇచ్చేలా నిర్మాణం జరిగిందో చెప్పాలని నిలదీశారు. ఒక్కో ఎకరా సాగుకు అవుతున్న ఖర్చు ఎంతో చెప్పాలని మంత్రి డిమాండ్ చేశారు.

## మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా

# మోహన్ యాదవ్



**తెలంగాణ వీణ/భోపాల్:** అనూహ్య రీతిలో మధ్యప్రదేశ్ నూతన ముఖ్యమంత్రిగా 58 సంవత్సరాల మోహన్ యాదవ్ ఎంపికయ్యారు. ఉజ్జయిన్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న మోహన్ యాదవ్ గతంలో శివరాజ్ సింగ్ చౌహాన్ మంత్రివర్గంలో మంత్రిగా పనిచేశారు. ఆయనతోపాటు ఉప ముఖ్యమంత్రులుగా జగదీష్ దేవడ, రాజేంద్ర శుక్లాను నియమితులయ్యారు. మాజీ కేంద్ర మంత్రి నరేంద్రసింగ్ తోమర్ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. డిసెంబర్ 3వ తేదీన అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడగా గత 8 రోజులగా ముఖ్యమంత్రి ఎంపికపై కొనసాగుతున్న ఉత్కంఠకు దీంతో తెరపడింది.పార్టీలో చాలా చిన్న కార్యకర్తనైన

వివరాలు 2లో

## ఎన్నికైన ప్రభుత్వంతోనే

# సమస్యల పరిష్కారం




**తెలంగాణ వీణ/జమ్ము :** ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ సుప్రీం కోర్టు తీర్పు వెలువరించడాన్ని జమ్ము లోని వాణిజ్య, పారిశ్రామిక వేత్తలు స్వాగతించారు. ఇక త్వరలో రాష్ట్రంగా జమ్ము కశ్మీర్ అవతరించి ప్రజాస్వామ్య పద్ధతిలో ఎన్నికల ద్వారా ప్రభుత్వం ఏర్పడాలని తాము ఆకాంక్షిస్తున్నామని పేర్కొన్నారు. అయితే కేంద్ర పాలిత ప్రాంతంగా జమ్ముకశ్మీర్‌ను తక్కువ చేయడాన్ని తాము కోరుకోవడం లేదని, త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరిపించడానికి, రాష్ట్రంగా ఏర్పాటుకాడానికి సుప్రీం కోర్టు వ్యవధిని నిర్ణయించడం అత్యంత ప్రశంసనీయమని జమ్ము చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీస్ అధ్యక్షుడు అరుణ్ గుప్తా పేర్కొన్నారు. ప్రస్తు త బ్యూరోక్రాట్ పాలనలో తాము సమస్యలను ఎదుర్కొంటున్నామని, లోక్‌సభ ఎన్నికలతోపాటు జమ్ముకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు కూడా నిర్వహించాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. సుప్రీం తీర్పు చారిత్రాత్మకంగా చాంబర్ ఆఫ్ ట్రేడర్స్ ఫెడరేషన్ జమ్ము అధ్యక్షుడు నీరజ్ ఆనంద్ ప్రశంసించారు. దేశంతో పూర్తిగా విలీనం కావాలని తాము కోరుకుంటున్నామని, ఇది ప్రజలందరి అభిమతమని తెలిపారు. గత 70 ఏళ్లుగా దేశం లోని ఇతర ప్రాంతాల కన్నా వెనుకబడి ఉన్న జమ్ముకశ్మీర్ ప్రజలకు సుప్రీం నిర్ణయం మేలి మలుపని అభివర్ణించారు. జమ్ము ఇండస్ట్రీస్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు అజయ్ లాంగర్ వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని సుప్రీం ఆదేశించడం తమకు ఆనందం కలిగిస్తోందన్నారు. ఎన్నికైన ప్రభుత్వం ఉంటే తమ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు.

## కెసిఆర్‌నీ పరామర్శించిన ఎమ్మెల్సీ రాజు



**తెలంగాణ వీణ/దుండిగల్:** యశోద హాస్పిటల్లో మాజీ ముఖ్యమంత్రి బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర రావు గారినీ పరామర్శించిన ఎమ్మెల్సీ,మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శంభీపూర్ రాజు

## అల్వాల్ తోట ముత్యాలమ్మ ఆలయంలో మంత్రి పొన్నం....



**తెలంగాణ వీణ/మల్కాజిగిరి:** రాష్ట్ర బీసీ సంక్షేమ, రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం అల్వాల్ లోని తోట ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి నియోజకవర్గం కాంగ్రెస్ నాయకులు మంత్రికి ఘనస్వాగతం పలికి మంత్రి అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్, బొబ్బిలి సురేందర్ రెడ్డి, ఎస్ కే చంద్రశేఖర్, కృష్ణ గౌడ్,సాయికుమార్, శకుంతల నాయుడు, మల్లికార్జున్ , కవిత, కార్యకర్తలు పాల్గొన్నారు.


## మరిన్ని విజయాలు సాధించాలి: రాచకొండ సీపీ

**- అభినందనలు స్వీకరించిన తెలంగాణ యువ పర్వతారోహకుడు భూక్యా యశ్వంత్ నాయక్**



**తెలంగాణ వీణ/మల్కాజిగిరి:** ఆస్ట్రేలియాలోని ఎత్తయిన కోషియాస్కో పర్వతం మీద భారత జాతీయ జెండాతో పాటుగా రాచకొండ కమిషనర్ డిఎస్ చౌహన్ చిత్రాన్ని ప్రదర్శించారు. తెలంగాణ యువపర్వతారోహకుడు భూక్యా యశ్వంత్ రాచకొండ కమిషనర్‌ను సోమవారం నేరెడ్ మెట్ లోని కార్యాలయంలో కలిసి అభినందనలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. శ్రమించే క్రీడాకారులకు అవసరమైన తోడ్పాటు ప్రోత్సాహం ఎల్లప్పుడూ అందిస్తామన్నారు. ప్రపంచంలోని మరిన్ని ప్రఖ్యాత పర్వతాలను నిరంతర శ్రమతో దిగ్విజయంగా అధిరోహించి దేశానికి, రాష్ట్రానికి మరింత పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. పర్వతారోహణ ఎన్నో సవాళ్లతో కూడుకున్న పని అని, ఎంతో కష్టతరమైనదని అన్నారు. అటువంటి రంగంలో గొప్ప విజయాలు సాధించడం ఎంతో గర్వకారణమన్నారు.

## నేడు నిజాంపేట్‌లో విద్యుతుండని ప్రాంతాలు



**తెలంగాణ వీణ/నిజాంపేట్:** 12.12.23 మంగళవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు 33/11 కేవి ప్రశాంతిహిల్స్ ఎస్ ఎస్ నుండి వెలువడే 11 కేవీ బృందావనల్స్ ఫీడర్‌లో 33/11 కేవీ మరియు ప్రశాంతిహిల్స్ నుండి కొత్తగా ప్రతిపాదించబడిన ఫీడర్‌కు 11కేవీ ఎబి కేబుల్ స్ట్రింగ్ కోసం విద్యుత్ సరఫరా ఉండదు. బృందావన్హిల్స్,ప్రశాంతిహిల్స్, సైదప్ప బస్తీ,రాజధాని పాఠశాల ప్రాంగణం,బండారి లేఅవుట్ రోడ్ నం.10 ఏఈ నిజాంపేట్ ఒకానొక ప్రకటనలో తెలిపారు.

# ఆర్టికల్ 370 తీర్పుపై అసదుద్దీన్ ఒవైసీ అసంతృప్తి

**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** జమ్మూ కాశ్మీర్‌లో ఆర్టికల్ 370 రద్దును సమర్థిస్తూ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై ఎంఐఎం అధినేత, ఎంపి అసదుద్దీన్ ఓవైసి అసంతృప్తి వ్యక్తం చేశారు. సుప్రీం తీర్పు నిరుత్సాహపరిచిందన్నారు. కర్ఫ్యూ అమలులో ఉండి, ఎన్నికైన అసెంబ్లీ పనిచేయకుండా చేసి ఎలాంటి చర్చ లేకుండా ఆర్టికల్ 356 ప్రకారం ఒక రాష్ట్రానికి ప్రత్యేక హోదాను రద్దు చేయడం ఎంత వరకు సమంజసమని ఆయన అన్నారు. ఆర్టికల్ 370 రద్దు ప్రక్రియలో కాశ్మీరీల అభిప్రాయం తీసుకోకపోవడాన్ని ఆయన ఎత్తిచూపారు.భారత రాజ్యాంగ ప్రాథమిక సూత్రంగా ఫెడరలిజం యొక్క ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. రాష్ట్రాలు తమ అధికార పరిధిలో స్వయంప్రతిపత్తిని కలిగి ఉన్నాయని రాజ్యాంగం సూచిస్తుందని ఆయనన్నారు. రాష్ట్ర శాసనసభలో చర్చించి ఆమోదించాల్సిన తీర్మానాన్ని పార్లమెంటు ఎలా అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహిస్తుందని



అసదుద్దీన్ ప్రశ్నించారు. రాష్ట్రాన్ని రద్దు చేయడం కశ్మీర్ ప్రజలకు కేంద్రం ఇచ్చిన హామీలకు ద్రోహం చేయడమేనని వ్యాఖ్యానించారు. రాష్ట్రాన్ని విభజించడం, తగ్గించడం వంటి చర్యలను ఆయన ఖండించారు.ఈ నిర్ణయం ద్వారా ఇతర రాష్ట్రాలపై ఇలాంటి చర్యలకు మార్గం సుగమం చేస్తుందని ఆయన హెచ్చరించారు. లడఖ్ ఇప్పుడు ప్రజాస్వామ్య ప్రాతినిధ్యం లేని లెఫ్టినెంట్ గవర్నర్ చేత పాలించబడుతోందన్నారు. జమ్మూ కాశ్మీర్ భారతదేశంలో అంతర్భాగమని అంగీకరిస్తూనే, ఈ ఏకీకరణ యూనియన్‌తో దాని ప్రత్యేక రాజ్యాంగ సంబంధాన్ని తిరస్కరించదని ఓవైసి అన్నారు. జమ్మూలోని డోగ్రాలు, లడఖ్‌లోని బౌద్ధులపై ఈ నిర్ణయం ప్రభావం గురించి ఒవైసీ ఆందోళన వ్యక్తం చేశారు. జమ్మూ కాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించడానికి స్పష్టమైన కాలమానం లేకపోవడాన్ని అసదుద్దీన్ ఎత్తిచూపారు. 2024 లోక్‌సభ ఎన్నికలతో పాటు జమ్మూ కాశ్మీర్ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై త్వరలో శ్వేత పత్రం

**తెలంగాణ వీణ/ఖమ్మం :** రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై త్వరలోనే శ్వేతపత్రం విడుదల చేస్తామని డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. 2014 నుంచి 2023 వరకు బిఆర్ఎస్ ప్రభుత్వంలో ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై శ్వేతపత్రం సిద్ధం చేస్తున్నామని అన్నారు. సోమవారం మధిర పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ%డ% సరైన సమయంలో సరైన వేదికపై ఈ శ్వేతపత్రం విడుదల చేస్తామని అన్నారు.

### బిఆర్ఎస్ పాలనలో సంస్థలు, వ్యవస్థలు నిర్వీర్యం

నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవం కోసం తెలంగాణ సమాజం కొట్లాడి రాష్ట్రాన్ని తెచ్చుకున్నామని, కానీ బీఆర్ఎస్ పాలనలో వనరుల దుర్వినియోగం, సంపద దోపిడీకి గురైందని ఆరోపించారు. పదేళ్ల బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలను నెరవేర్చకపోగా ఉన్న స్వేచ్ఛను సైతం హరించిందని వ్యాఖ్యానించారు. బిఆర్ఎస్ పాలన అస్తవ్యస్తంగా కొనసాగగా సంపద దోపిడీకి గురి కావడం, సంస్థలు, వ్యవస్థలు నిర్వీర్యం, విచ్ఛిన్నం అయ్యాయని అన్నారు. భారత రాజ్యాంగం ఏర్పాటు చేసుకున్న తర్వాత వ్యవస్థీకృతమైన సమాజాన్ని బిఆర్ఎస్ ప్రభుత్వం నిర్వీర్యం చేసి 70 సంవత్సరాల వెనుక ఉన్న ఆర్థిక అసమానతలు కలిగిన ఫ్యూడల్ సమాజాన్ని నిర్మించిందని వ్యాఖ్యానించారు.ప్రభుత్వంలోని ప్రతి వ్యవస్థ, సంస్థలు ప్రజలకు జవాబుదారీగా ఉండాలని, ప్రజల కోసం మాత్రమే అధికారులు పనిచేయాలన్నారు. పదేళ్ల బిఆర్ఎస్ పాలనలో జరిగిన కుట్రపూరితమైన పాలనకు ఇక చరమగీతం పాడుతున్నామని అన్నారు.

### రాష్ట్రవ్యాప్తంగా ప్రజా దర్బార్లు

ప్రజా దర్బార్లు రాష్ట్రవ్యాప్తంగా జరుగుతాయని. ప్రజలు ఇచ్చిన వినతులపై తిరిగి సమాధానాలు స్పష్టంగా ప్రజలకు అందించేందుకు ప్రత్యేకంగా అధికారులను నియమిస్తామన్నారు.



గత ప్రభుత్వాలు తూతూ మంత్రంగా, జవాబుదారీగా లేకుండా గ్రీవెన్స్ నిర్వహించాయని, ప్రజల సమస్యల పరిష్కారం దిశగా అడుగులు వేయలేదని ఇప్పుడు అలాంటి పరిస్థితి ఉండదన్నారు.

### మధిర అభివృద్ధిపై ప్రత్యేక డాక్యుమెంటరీ

మధిర నియోజకవర్గం అభివృద్ధిపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేశామని,. ఈ సమావేశానికి బిఆర్ఎస్ నాయకులను కూడా ఆహ్వానిస్తామని మల్లు భట్టి తెలిపారు. మధిర నియోజకవర్గ అభివృద్ధికి ఏం కావాలి? భవిష్యత్తు అవసరాలు ఏంటి? ఐదు ఏండ్లలో ప్రణాళికాబద్ధంగా ఎలా అభివృద్ధి చేయాలి? ఎన్నికల్లో ఇచ్చిన హామీలకు తోడు తనకున్న ఆలోచనలను జోడించి త్వరలో డాక్యుమెంటరీ తయారు చేస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి వివిధ రంగాల నిష్ణాతులు, మేధావులు సలహాలు సూచనలు ఇవ్వొచ్చని ఆయన అన్నారు. పార్టీలకు సంబంధం లేకుండా వచ్చి సలహాలు సూచనలు ఇవ్వాలని, ఇందులో ఎలాంటి బేషజాలు లేవన్నారు. నియోజకవర్గంలో ఉన్న ప్రతి ఒక్కరికీ పనిచేస్తామని, ప్రజలు తమ సమస్యలను నేరుగా ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చి చెప్పుకోవచ్చని భట్టి తెలిపారు. కాగా, చారిత్రాత్మకమైన ప్రజల తీర్పు తర్వాత ప్రజా ప్రభుత్వం ఏర్పాటు జరిగిన క్రమంలో దేవాలయంలా భావించే అసెంబ్లీలో ఈ నెల 14 నుంచి సమావేశాలు ప్రారంభమవుతాయని తెలిపారు.

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రిగా

## మోహన్ యాదవ్

(మొదటి పేజీ తరువాయి)

తనను ముఖ్యమంత్రి పదవికి ఎంపిక చేసినందుకు మోహన్ యాదవ్ పార్టీ రాష్ట్ర నాయకత్వానికి, కేంద్ర నాయకత్వానికి కృత జ్ఞతలు తెలిపారు. ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా, పార్టీ అధ్యక్షుడు జెపి నడ్డాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేసిన మోహన్ యాదవ్ తనకు అప్పగించిన బాధ్యతను సమర్థంగా నిర్వహించడానికి కృషి చేస్తానని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ నూతన ముఖ్యమంత్రి మోహన్ యాదవ్‌ను పుష్పగుచ్ఛంతో అభినందించి ఆశీస్సులు అందచేశారు. సోమవారం బిజెపి శాసనసభా పక్ష సమావేశం జరుగగా ముఖ్యమంత్రి అభ్యర్థి పేరును పార్టీ కేంద్ర పరిశీలకులలో ఒకరైన మనోహర్ లాల్ ఖట్టర్ ప్రకటించారు.

### మోహన్ యాదవ్ రాజకీయ ప్రస్థానం:

2013లో తొలిసారి ఎమ్మెల్యేగా గెలుపొంది మోహన్ యాదవ్ తన రాజకీయ ప్రస్థానాన్ని ప్రారంభించారు. తిరిగి 2018లో జరిగిన మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలలో ఆయన మరోసారి గెలుపొందారు. 2020 జులై 2న ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ సారథ్యంలోని క్యాబినెట్‌లో మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయడంతో రాష్ట్రంలో ఆయన రాజకీయ ఎదుగుదల మరింత బలపడింది. 2023 అసెంబ్లీ ఎన్నికలలో ఉజ్జయిన్ సౌత్ నుంచి పోటీ చేసిన మోహన్ యాదవ్ తన సమీప కాంగ్రెస్ ప్రత్యర్థి చేతన్ ప్రేమ్‌నారాయన్ యాదవ్‌పై 12,941 ఓట్ల ఆధిక్యతతో గెలుపొందారు. ఈ గెలుపుతో ఆయన హ్యాట్రిక్ విజయం సాధిం చడమే కాకుండా ముఖ్యమంత్రి పీఠాన్ని చేజిక్కించుకున్నారు. 1965 మార్చి 25న ఉజ్జయిన్‌లో జన్మించిన మోహన్ యాదవ్ అనేక దశాబ్దాలుగా బిజెపిలోనే కొనసాగుతున్నారు.రాజకీయ నేతగానే గాక వ్యాపారవేత్తగా కూడా ఆయన రాణిస్తున్నారు.

# జవహర్ నగర్ కార్పొరేషన్‌లో కొనసాగుతున్న భూ దందా....

**- ప్రభుత్వస్థలాలను స్వాహా చేస్తోన్న ఘనులు...**
**- చోద్యం చూస్తోన్న అధికారులు...**
**- స్థానిక ప్రజాప్రతినిధుల అండదండలు...**




**తెలంగాణ వీణ/జవహర్ నగర్:** జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రభుత్వ స్థలాలు స్వాహా చేస్తున్నా అధికారులు పట్టించుకోవటం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దర్జాగా ప్రభుత్వ భూములను కబ్జా చేస్తూ యథేచ్ఛగా నిర్మాణాలు కొనసాగిస్తున్నారు. ఇటీవల అధికారులు ఎన్నికల నిర్వహణలో ఉండటాన్ని ఆదనుగా తీసుకున్న కబ్జాదారులు ప్రభుత్వ స్థలాల్లో నిర్మాణాలు చేపడుతూ దర్జాగా భూదందా కొనసాగిస్తున్నారు. జవహర్ నగర్లో చేతివాటం ప్రదర్శిస్తున్న భూ కబ్జాదారులు. సర్వే నెంబర్లు 136, 137, 150,151, 807,808, 62,63 లలోని ప్రభుత్వ స్థలాలను ప్లాట్లుగా మార్చి రియల్ ఎస్టేట్ వ్యాపారులు వ్యాపారాలు కొనసాగిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇక్కడి ప్రభుత్వ స్థలాలను వెంచర్లుగా మార్చి భూదందా నిర్వహిస్తూ అక్రమార్కులు సొమ్ము చేసుకుంటున్నా అధికారులు ఇటువైపు చూడకపోవటంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ హెచ్చరిక బోర్డులను లెక్కచేయకుండా ప్లాట్లుగా మార్చి వ్యాపారం నిర్వహిస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ భూముల్ని కాపాడడంలో రెవెన్యూ యంత్రాంగం పూర్తిగా విఫలమైతుందనే ఆరోపనులు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో సర్వే నిర్వహించి అక్రమ వెంచర్లు, అక్రమ నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రభుత్వ భూములను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.



## నాదెండ్ల మనోహర్ అరెస్ట్‌పై

# నాగబాబు ఆగ్రహం




**తెలంగాణ వీణ/ఏపీ బ్యూరో :** జనసేన కీలక నేత నాదెండ్ల మనోహర్ తో పాటు పలువురు నేతలను వైజాగ్ పోలీసులు అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. టైకూన్ జంక్షన్ లో రోడ్డును మూసివేయడంపై ధర్నాకు దిగిన నేపథ్యంలో వారిని అరెస్ట్ చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వం, పోలీసుల తీరుపై జనసేన నేత, సినీ నటుడు నాగబాబు విమర్శలు గుప్పించారు. ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలపడం తప్పా? ప్రజల తరపున నిలబడటం తప్పా? సమస్యల పరిష్కారానికి ప్రజా గొంతుకను వినిపించడం తప్పా? మేము దాడులు చేయలేదు, దహనాలు చేయలేదు... రాజ్యాంగం మాకు కల్పించిన హక్కుల పరిధిలో పోరాడటం తప్పా? అని ప్రశ్నించారు. విశాఖ పట్నంలో టైకూన్ జంక్షన్ ను మూసివేసి ప్రజలను తీవ్ర ఇబ్బం దులకు గురి చేస్తుంటే నిరసన తెలిపి, ఆ కూడలిని తెరవాలని కోరినందుకు తమ జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ ఛైర్మన్ నాదెండ్ల మనోహర్ ను అరెస్టు చేయడం అప్రజాస్వామికమని విమర్శించారు. ప్రజాస్వామ్యయుతంగా నిరసన తెలపాలని మనోహర్ ఆధ్వర్యంలో పార్టీ నేతలు, వీర మహిళలు సన్నద్ధమయ్యారని... అయితే, వారిపట్ల పోలీసులు ప్రవర్తించిన తీరును ఖండిస్తున్నామని చెప్పారు.

# తిరుమలలో 17 నుండి తిరుప్పావై పారాయణం

**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి మాసోత్సవాల్లో అత్యంత ముఖ్యమైనదిగా భావించే ధనుర్మాసం సందర్భంగా డిసెంబరు 17 నుండి 2024 జనవరి 14వ తేదీ వరకు పెద్ద జీయ్యర్ స్వామి మఠంలో తిరుప్పావై పారాయణం చేయనున్నారు. తిరుమల శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న పెరియ కోయిల్ కేల్వి‌అప్పన్ శఠగోప రామానుజ పెద్ద జీయర్ స్వామి మఠంలో నెల రోజుల పాటు ఉదయం 7 నుండి 8 గంటల వరకు తిరుప్పావై పాశురాలను పారాయణం చేస్తారు. ఈ పారాయణ కార్యక్రమాన్ని శ్రీ వేంకటేశ్వర భక్తి ఛానల్ ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. విశిష్టాద్వైత సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన భగవద్ రామానుజాచార్యుల కాలంలో తిరుమలలో పెద్ద జీయర్ మఠం ఏర్పాటైంది. శ్రీవారి ఆలయంలో వైఖానస ఆగమం ప్రకారం శ్రీ రామానుజాచార్యులు ప్రవేశపెట్టిన కైంకర్యాలు, క్రతువులు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. శ్రీ రామానుజాచార్యుల పరంపరలో వస్తున్న జీయర్ స్వాములు తిరుమల శ్రీవారి ఆలయ కైంకర్యాలు, సేవలు, ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు.

## కపిలేశ్వరాలయంలో ముగిసిన రుద్రయాగం

తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో 11 రోజుల పాటు జరిగిన శ్రీ కపిలేశ్వరస్వామివారి హోమం (రుద్రయాగం) సోమవారం శాస్త్రోక్తంగా ముగిసింది. ఆలయంలో హోమ మహోత్సవాలు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఉదయం రుద్రయాగం సమాప్తి, మహాపూర్ణాహుతి, మహాశాంతి అభిషేకం, కలశ ఉద్వాసన, శ్రీ కపిలేశ్వరస్వామి మూలవర్లకు కలశాభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6 నుండి 7.30 గంటల వరకు శివపార్వతుల కల్యాణోత్సవం జరుగనుంది. తరువాత రాత్రి 7.30 నుండి 8.30 గంటల వరకు శ్రీ చండికేశ్వరస్వామివారి కలశ స్థాపన, కలశ ఆరాధన, హోమం నిర్వహించనున్నారు. డిసెంబరు 12న చండికేశ్వరస్వామివారి హోమం జరుగనుంది. టిటిడి ఈఓ ఎవి.ధర్మారెడ్డి, జేఈఓ వీరబ్రహ్మం, ఆలయ డెప్యూటీ ఈఓ దేవేంద్రబాబు, ఏఈఓ సుబ్బరాజు, సూపరింటెండెంట్ భూపతి, ఆలయ అర్చకులు, అధికారులు పాల్గొన్నారు.




# జిల్లాలో వైఎస్సార్ లా నేస్తం ద్వారా 98 మంది జూనియర్ న్యాయవాదులకు రూ.29.40 లక్షల లబ్ధి

**- బటన్ నొక్కి న్యాయవాదుల ఖాతాల్లో నగదు జమ చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి - ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయాన్ని యువ న్యాయవాదులు సద్వినియోగం చేసుకోండి**

**- జిల్లా కలెక్టర్ డా.మనజిర్ జిలాని సమూన్**

**తెలంగాణ వీణ/నంద్యాల ప్రతినిధి:** కొత్తగా న్యాయవాద వృత్తిలో ప్రవేశించి యువ న్యాయవాదులు వారి వృత్తిలో స్థిరపడే వరకు జూనియర్ న్యాయ వాదులను ప్రోత్సహిస్తూ 'వైఎస్సార్ లా నేస్తం' ద్వారా ఆర్థిక సహాయాన్ని అందిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ పేర్కొన్నారు. సోమవారం తా దేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి వైఎస్సార్ లా నేస్తం ద్వారా రాష్ట్రంలోని అర్హులైన 2,807 మంది జూనియర్ న్యాయవాదులకు నెలకు 5 వేలు రూపా యలు చొప్పున 2023-24 సంవత్సరానికి రెండవ విడత ఆర్థిక సాయంగా జూలై 2023 నుండి డిసెంబరు 2023 ఆరు నెలలకు గాను రూ.30 వేలు చొప్పున రూ.7.98 కోట్లు వారి ఖాతాల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నగదు జమ చేసే కారక్రమాన్ని కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్, మైనారిటీ సంక్షేమ ప్రభుత్వ సలహాదారు హబీబుల్లా, మార్క్ఫెడ్ చైర్మన్ పి..పి.నాగిరెడ్డి, నంది కొట్కూరు శాసన సభ్యులు తోగూరు ఆర్థర్, ఏపి ఎస్సీడిసిఎల్ డైరెక్టర్ శశికళ రెడ్డి జూనియర్ అడ్వకేట్ లు తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. మనజిర్ జిలాని సమూన్ మాట్లాడుతూ వైయస్సార్ లా నేస్తం పథకం కింద రాష్ట్రంలో అర్హులైన 2,807 మంది జూనియర్ న్యాయవాదులకు 7.98 కోట్ల ఆర్థిక సహాయం ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. వృత్తిపరంగా యువ న్యాయవాదుల ఇబ్బందులను గుర్తించిన ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామీలో భాగంగా వైఎస్సార్ లా నేస్తం పథకాన్ని ప్రవేశపెట్టారన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని 98




మంది జూనియర్ న్యాయవాదులకు నెలకు రు. 5 వేల చొప్పున 29.40 లక్షల రూపాయల ఆర్థిక సహాయ పంపిణీని నేరుగా వారి ఖాతాల్లో జమ చేశామని కలెక్టర్ వివరించారు. ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయాన్ని యువ న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆళ్లగడ్డ నియోజకవర్గానికి సంబంధించి 18 మంది లాయర్లకు రూ.5.40 లక్షలు, బనగానపల్లె నియోజకవర్గంలో 18 మందికి రూ.5.40 లక్షలు, డోన్ నియోజకవర్గంలో 15 మందికి రూ.4.50 లక్షలు, నందికొట్కూరు నియోజకవర్గంలో ఇద్దరికి రూ. 60,000 లు, నంద్యాల నియోజకవర్గంలో 37 మం దికి రూ.11.10 లక్షలు, పాణ్యం నియోజకవర్గంలో ఒకరికి రూ.30,000 లు, శ్రీశైల నియోజకవర్గంలో 7 మందికి రూ.2.10 లక్షలు చొప్పున మొత్తం 98 మంది యువ లాయర్ల కు రూ.29.40 లక్షలు రాష్ట్ర ప్రభుత్వం జమ చేసిందని కలెక్టర్ వివరించారు. అనంతరం లబ్ది పొందిన యువ లాయర్ల కు 29.40 లక్షల విలువ గల చెక్కును అతిథులు అందచేశారు.

## ఎన్నికల ముందు వైసీపీ షాకింగ్ నిర్ణయం..

# 11 అసెంబ్లీ సెగ్మెంట్లకు కొత్త ఇన్‌చార్జీలు!

**తెలంగాణ వీణ/అమరావతి:** వచ్చే ఏడాది ఏప్రిల్, మే నెలల్లో ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరుగను న్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు సన్నద్ధం అయ్యేందుకు అధికారిక వైసీపీ ఇప్పటి నుంచి కార్యాచరణ ప్రారం భించింది. వివిధ నియోజకవర్గాల్లో రాజకీయ పరిస్థి తులు, వివిధ సర్వేల ఆధారంగా పలు అసెంబ్లీ నియో జకవర్గాల్లో ఇన్ చార్జీలను మార్చేసింది. కొత్తగా 11 అసెంబ్లీ సెగ్మెంట్లకు ఇన్ చార్జీలను నియమించింది. ఆయా నియోజక వర్గాల్లో పార్టీ వ్యవహారాలను కొత్త ఇన్ చార్జీలు పర్యవేక్షిస్తారని ఏపీ మంత్రి బొత్స సత్యనారాయణ సోమవారం మీడియాకు తెలిపారు. పత్తిపాడు ఎస్సీ స్థానంలో బాలసాని కిరణ్ కుమార్, కొండెపి (ఎస్సీ)లో ఆదిమూలపు సురేశ్, వేమూరు (ఎస్సీ)లో అశోక్ బాబు, తాటికొండ (ఎస్సీ)లో మేకతోటి సుచరిత, సంతనూతల పాడు (ఎస్సీ)లో మేరుగు నాగార్జున ఇన్ చార్జీలుగా వ్యవహరిస్తారు. చిలకలూరి పేట అసెంబ్లీ స్థానానికి రాజేశ్ నాయుడు, గుంటూరు వెస్ట్ స్థానంలో విడదల రజినీ, అద్దంకి నుంచి పాణెం హనిమి రెడ్డి, మంగళగిరిలో గంజి చిరంజీవి, రేపల్లెలో ఈవూరు గణేశ్, గాజువాక స్థానంలో వరికూటి రామచంద్రరావు ఇన్ చార్జీలుగా వ్యవహరిస్తారని బొత్స సత్యనారాయణ తెలిపారు.

# శ్రీశైలంలో కార్తీక సందడి.. ఆఖరి వారం స్వామి నామస్మరణతో మార్మోగిన శైవక్షేత్రం..!

**తెలంగాణ వీణ/శ్రీశైలం:** భ్రమరాంబికా మల్లికార్జున స్వామి అమ్మవార్లను దర్శించుకునేందుకు వచ్చిన భక్తు లతో క్షేత్రం సందడి సందడిగా మారింది. కార్తీక మాస శోభను సంతరించుకున్న శ్రీశైల మహాక్షేత్రం శివ నామ స్మరణతో మార్మోగుతున్నది. కార్తీకమాసం ఆఖరి వారం కావడంతోపాటు వారాంతపు సెలవులు కలిసి రావ డంతో కుటుంబ సమేతంగా క్షేత్రానికి చేరుకుం టున్నారు.వివిధ ప్రాంతాల నుండి వచ్చిన యాత్రికులు సోమవారం తెల్లవారు జామునే తలనీలాలు సమ ర్పించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన గంగాధర మండపం, ఉత్తర మాడవీధి వద్ద దీపాలు వెలిగించి, పూజలు చేసుకొన్నారు. భక్తులకు స్వామి అమ్మవార్ల ఉచిత దర్శనానికి 4 గంటలు, శీఘ్ర దర్శనానికి రెండు గంటల సమయం, అతి శీఘ్ర దర్శనానికి గంట సమయం పడుతున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. దర్శన అనంతరం బయటకు వచ్చే భక్తులకు అమ్మవారి ఆలయం వెనుక భాగంలో కూడా ప్రసాద వితరణ చేస్తున్నారు.

### ఆంక్షలతో భక్తుల తిప్పలు

కార్తీకమాసం ఆఖరి రోజులు కావడంతో ఒక్కసారిగా వేలాది



మంది భక్తులు తరలి వస్తున్నారు. క్షేత్ర వలయ రహదారి వరకే వాహనాలను అనుమతించడంతో గమ్యస్థానాలకు చేరుకునేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని యాత్రికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే భక్తుల రద్దీకి అనుగుణంగా అంద రికీ స్వామి అమ్మవార్ల అలంకార దర్శనం మాత్రమే కల్పిస్తున్నట్లు ఈవో పెద్దిరాజు చెప్పారు. గురువారం నుండి ఆర్జిత సేవా టిక్కెట్లు, గర్భాలయ దర్శనాలు య థావిధిగా అందుబాటులో కొనసాగుతాయని చెప్పారు. రోజురోజుకు పెరుగుతున్న రద్దీ వల్ల క్షేత్ర దర్శనానికి వచ్చే వారు ముందుగా ఆన్‌లైన్ ద్వారా వసతి ఏర్పాట్లు సమకూర్చుకోవాలని ఈవో పెద్దిరాజు సూచించారు.



## జనవరి 22న అయోధ్య రామయ్య ప్రాణప్రతిష్ఠ



**తెలంగాణ వీణ/జాతీయం:** ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్యలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న రామమందిరంలో రాముని ప్రాణప్రతిష్ఠ వచ్చే ఏడాది జనవరి 22న నిర్వహించాలని నిర్ణయించినట్టు రామమందిర నిర్మాణ కమిటీ చైర్మన్ నృపేంద్ర మిశ్రా తెలిపారు. రామమందిర నిర్మాణ పనులపై సమీక్షించిన తర్వాత గతంలోనే నిర్ణయించిన జనవరి 22వ తేదీనే ప్రాణప్రతిష్ఠ జరపాలని నిశ్చయించామన్నారు. ఇప్పటికే దీనికి సంబంధించిన అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని అయోధ్య రామమందిర నిర్మాణ కమిటీ స్పష్టీకరించింది. దేవాలయంలో రాముని విగ్రహాన్ని ప్రతిష్ఠించే గర్భగుడికి సంబంధించిన చిత్రాలను శనివారమే విడుదల చేశామని,గర్భగుడి నిర్మాణం, లైటింగ్ ఏర్పాట్లు కూడా పూర్తి చేశామని తెలిపారు. వేద పండితుడు వారణాసి లక్ష్మీకాంత్ నేతృత్వంలో ప్రాణప్రతిష్ఠ వైదిక ఆచార క్రియలు జనవరి 16న ప్రారంభమవుతాయని తెలిపారు.

## త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పతనం..



**తెలంగాణ వీణ/బెంగళూరు:** కర్నాటకలోని సిద్దరామయ్య ప్రభుత్వంలో అంతా సవ్యంగా లేదని జనతా దళ్(సెక్యులర్) నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి హెచ్‌డి కుమారస్వామి వ్యాఖ్యానించారు. సిద్దరామయ్య సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి చెందిన ఒక మంత్రి త్వరలోనే బిజెపిలో చేరనున్నారని ఆదివారం కర్నాటకలోని హసన్‌లో విలేకరులతో మాట్లాడుతూ కుమారస్వామి వెల్లడించారు. ఆ తర్వాత ఆ మంత్రి అడుగుజాడల్లోనే 50 నుంచి 60 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయిస్తారని ఆయన ఆరోపించారు. 50-60 మంది ఎమ్మెల్యేల మద్దతుతో ఒక కాంగ్రెస్ మంత్రి బిజెపిలో చేరతారని,త్వరలోనే కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుందని కుమారస్వామి జోస్యం చెప్పారు. ఏ క్షణంలో ఏమైనా జరగవచ్చని, ఎవరిలోను నిజాయితే, విధేయత లేదని ఆయన ఆరోపించారు. ఆ మంత్రి పేరు చెప్పాలని విలేకరులు కోరగా అటువంటి సాహసోపేతమైన చర్యను చిన్న నాయకుల నుంచి ఊహించలేమని, చాలా పలుకుబడి కలిగిన నాయకులే అటువంటి పనులు చేయగలరని కుమారస్వామి వ్యాఖ్యానించారు. ఇలా ఉండగా, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పడిపోతుందంటూ జెడిఎస్, బిజెపి భ్రమల్లో బతుకుతున్నాయని కర్నాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య సోమవారం ఎద్దేవా చేశారు.

## వేర్పాటువాదం ఇక గతమే: అమిత్ షా



**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:** ఆర్టికల్ 370 రద్దులో ప్రధాని మోడీతో పాటుగా కీలక పాత్ర పోషించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా కూడా సుప్రీంకోర్టు తీర్పుపై హర్షం వ్యక్తం చేశారు.‘ ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత పేదలు, అణగారిన వర్గాల హక్కుల పునరుద్ధరణ జరుగుతుంది. వేర్పాటువాదం, రాళ్లు రువ్వే ఘటనలు ఇక గతమే. జమ్మూ కశ్మీర్, లడఖ్‌ప్రాంత సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి ఉన్నాం.స్థానిక ఆర్థిక వ్యవస్థను వృద్ధి చేయడం,అత్యాధునిక విద్యా మౌలిక వసతులను కల్పించడం,పేదలకు సాధికారత కల్పించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నాం’ అని అమిత్ షా ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు. ఆయన తన ట్వీట్‌కు నయా జమ్మూ కశ్మీర్ అన్న హ్యాష్‌ట్యాగ్‌ను జత చేశారు.

# రాష్ట్ర హోదా కల్పించి వెంటనే అసెంబ్లీ ఎన్నికలు జరపాలి: కాంగ్రెస్

**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:** జమ్మూ కశ్మీరుకు తక్షణమే రాష్ట్ర ప్రతిపత్తిని కల్పించాలని, ప్రజలు తమకు నచ్చిన ప్రభుత్వాన్ని ఎన్నుకునేందుకు వీలుగా రాష్ట్రంలో వెంటనే అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ సోమవారం డిమాండ్ చేసింది. జమ్మూ కశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే రాజ్యాంగంలోని 370వ అధికరణాన్ని రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టుకు చెందిన ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం సమర్థిస్తూ తీర్పును వెలువరించింది. అంతేగాక వచ్చే ఏడాది సెప్టెంబర్ 30 లోగా అక్కడ అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ స్పందించింది. కాంగ్రెస్ నాయకులు పి చిదంబరం, అభిషేక్ సింఘ్వీ విలేకరులతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు తన తీర్పులో అనేక అంశాలను స్పృశించింది కాని కొన్ని అంశాలను విస్మరించిందని అన్నారు.తీర్పును జాగ్రత్తగా అధ్యయనం చేయవలసి ఉందని అంటూ 370వ అధికరణను రద్దు చేసిన తీరుపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును తాము గౌరవిస్తూనే విభేదిస్తున్నామని చిదంబరం చెప్పారు. జమ్మూ కశ్మీరుకు పూర్తిస్థాయి రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించాలని తాము మొదటి నుంచి డిమాండు చేస్తున్నామని, ఈ విషయంలో సుప్రీంకోర్టు తీర్పును తాము స్వాగతిస్తున్నామని ఆయన తెలిపారు. తక్షనమే రాష్ట్ర ప్రతిపత్తిని పునరుద్ధరించాలని, లడఖ్ ప్రజల ఆకాంక్షలను కూడా నెరవేర్చాలని ఆయన కోరారు. వచ్చే ఏడాది సెప్టెంబర్ 30 వరకు ఎన్నికల కోసం వేచి ఉండాల్సిన అవసరం లేదని, వెంటనే అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. జమ్మూ కశ్మీరుకు రాష్ట్ర ప్రతిపత్తిని తొలగించి రెండు కేంద్ర పాలిత ప్రాంతాలు చేసిన అంశంపై సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకోకపోవడం నిరాశను కలిగిస్తోందని చిదంబరం చెప్పారు. జమ్మూ కశ్మీరు పౌరులు ప్రజాస్వామ్యాన్ని కోరుకుంటున్నారే తప్ప నియంతృత్వాన్నికాదని అభిషేక్ సింఘ్వీ వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య ప్రభుత్వం అంటే కేంద్రం ఎందుకు భయపడుతోందని ఆయన ప్రశ్నించారు.

# ఆర్టికల్ 370 రద్దు రాజ్యాంగబద్ధమే

**తెలంగాణ వీణ/న్యూఢిల్లీ:** జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ని రద్దు రాజ్యాంగ సమ్మతమేనని సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది. ఒకప్పటి జమ్మూ కశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 370ని రదురాజ్యాంగ బద్ధతను సవాలు చేస్తూ దాఖలయిన పిటిషన్లపై సుప్రీంకోర్టు సోమవారం కీలక తీర్పు వెలువరించింది. ఈ అంశంపై పిటిషనర్ల వాదనలను తోసిపుచ్చిన రాజ్యాంగ ధర్మాసనం ఆర్టికల్ 370ని రదు చేస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని సమర్థించింది.‘ జమ్మూ, కశ్మీర్‌పై ప్రభుత్వం తీసుకున్న ప్రతి నిర్ణయాన్ని సవాలు చేయలేరు. భారత్‌లో విలీనం తర్వాత జమ్మూ, కశ్మీర్‌కు ప్రత్యేక సార్వభౌమాధికారం లేదు.అప్పట్లో యుద్ధ పరిస్థితుల దృష్టా ఆర్టికల్ 370ని ప్రవేశపెట్టారు. అది తాత్కాలిక ఏర్పాటే తప్ప శాశ్వతం కాదు. దాన్ని రద్దు చేసే అధికారం రాష్ట్రపతికి ఉంది. హక్కుల విషయంతో జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేకత ఏమీ లేదు.దేశంలోని ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలతో అది కూడా సమానమే. ఆర్టికల్ 1, ఆర్టికల్ 370 ప్రకారం జమ్మూ కశ్మీర్ భారత్‌లో అంతర్భాగమే’నని సిజెఐ జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం తీర్పు చెప్పింది. ధర్మాసనంలోని జడ్జీలు మూడు వేర్వేరు తీర్పులను వెలువరించినప్పటికీ అందరూ కూడా రద్దు సక్రమమేనని పేర్కొనడం విశేషం. కాగా జస్టిస్ చంద్రచూడ్ తీర్పును వెలువరించారు. ఈ సందర్భంగా జమ్మూ కశ్మీర్‌నుంచి లడఖ్‌ను విడదీసి కేంద్రపాలిత ప్రాంతంగా చేయడాన్ని కూడా సుప్రీంకోర్టు సమర్థించింది.అయితే ప్రస్తుతం కేంద్రపాలిత ప్రాంతంగా ఉన్న జమ్మూ కశ్మీర్‌లో రాష్ట్ర హోదాను వీలయినంతత్వరగా పునరుద్ధరించాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. 2024 సెప్టెంబర్ 30లోగా జమ్మూ కశ్మీర్‌లో ఎన్నికలు నిర్వహించడానికి కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.



### మానవ హక్కుల ఉల్లంఘనలపై దర్యాప్తు జరపాలి

ఆర్టికల్ 370 రద్దు అంశంపై రాజ్యాంగ ధర్మాసనం మొత్తం మూడు తీర్పులు వెలువరించింది. సిజెఐ చంద్రచూడ్, జస్టిస్ బిఆర్ గవాయ్, జస్టిస్ సూర్యకాంత్‌లు కలిసి ఒక తీర్పును వెలువరించగా , జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్, జస్టిస్ సంజీవ్ ఖన్నాలు వేర్వేరు తీర్పులు వెలువరించారు. ఈ సందర్భంగా జస్టిస్ ఖన్నా తన తీర్పును వెలువరిస్తూ జమ్మూ కశ్మీర్‌లో చోటు చేసుకున్న మానవ హక్కుల ఉల్లంఘనలపై దర్యాప్తు జరగాలన్నారు. దీనికోసం ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు.1980నుంచి జమ్మూ కశ్మీర్‌లో జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనలు, హింసాత్మక ఘటనలపై ఈ కమిటీ దర్యాప్తు చేపట్టాలని పేర్కొన్నారు. అయితే ఆయన సిజెఐ, జస్టిస్ కౌల్ తీర్పులతో ఏకీభవించారు.

### పండిట్ల వలసలు స్వచ్ఛందం కాదు

కాగా, జమ్మూ కశ్మీర్‌నుంచి కశ్మీరీ పండిట్ల వలసలు స్వచ్ఛందంగా జరిగినవి కాదని జస్టిస్ కౌల్ తన తీర్పులో అభిప్రాయపడ్డారు. 1980లో రాష్ట్రంలో జరిగిన హింసాకాండే కశ్మీరీ పండిట్ల వలసలకు కారణమని ఆయన అన్నారు. 1947నుంచి కూడా కశ్మీర్ లోయ ఎన్నో దురాక్రమణలకు గురయిందని ఆయన అన్నారు. రాష్ట్రంలోకి సైన్యం రాకను ప్రస్తావిస్తూ సైన్యం పని శాంతి భద్రతలను కాపాడడం కాదని, అయితే ఇది ప్రత్యేకమైన పరిస్థితి అని, దేశ సమగ్రత, సార్వభౌమాధికారానికే ముప్పుగా పరిణమించడం వల్లనే సైన్యాన్ని దించాల్సి వచ్చిందని ఆయన అన్నారు.జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హోదాను కల్పించే ఆర్టికల్ 370ని కేంద్రం 2019 ఆగస్టు 5న రద్దు చేసింది. ఆ రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా విభజించింది.ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ జమ్మూ కశ్మీర్‌కు చెందిన పలు పార్టీలు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. వాటిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్ నేతృత్వంలోని అయిదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఈ ఏడాది ఆగస్టు 2నుంచి సుదీర్ఘంగా విచారణ జరిపింది. సెప్టెంబర్ 5న తన తీర్పును రిజర్వ్ చేసింది. తాజాగా సోమవారం తీర్పు వెలువరించింది. సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువడిన నేపథ్యంలో కశ్మీర్ అధికార యంత్రాంగం కట్టుదిట్టమయిన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. రెండు వారాలుగా కశ్మీర్ లోయలోని 10 జిల్లాల్లో భద్రతా ఏర్పాట్లపై పోలీసులు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. ఇప్పటికే కొందరు నాయకులను అదుపులోకి తీసుకోగా మరికొందరిని గృహనిర్బంధంలో ఉంచారు.

## సుదీర్ఘ పోరాటానికి సిద్ధంగా ఉన్నాం: ఒమర్ అబ్దుల్లా

**తెలంగాణ వీణ/శ్రీనగర్:** జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించిన ఆర్టికల్ 370 రద్దు సక్రమమేనని పేర్కొంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై బిజెపి నేతలు హర్షం వ్యక్తం చేస్తుండగా




కశ్మీర్‌కు చెందిన నేతలు మాత్రం సుప్రీంకోర్టు తీర్పు తమకు తీవ్ర నిరాశను కలిగించిందని పేర్కొన్నారు. నేషనల్ కాన్ఫరెన్స్ ఉపాధ్యక్షుడు , రాష్ట మాజీ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా సుప్రీంకోర్టు తీర్పుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ‘ తీర్పుతో అసంతృప్తితో ఉన్నాం. కానీ నిరాశపడడం లేదు. ఆర్టికల్ 370ని రద్దే చేయడానికి బిజెపికి కొన్ని దశాబ్దాలు పట్టింది. మేం కూడా సుదీర్ఘ పోరాటానికి సిద్ధమవుతున్నాం.దీనిపై మా పోరాటం కొన సాగుతుంది’ అని ఒమర్ అబ్దుల్లా ఒక ట్వీట్‌లో పేర్కొన్నారు. ఆశను కోల్పోరాదని పేర్కొంటూ ప్రముఖ కవి ఫౌజ్ అహ్మద్ ఫౌజ్ రాసిన ఓ కవితను కూడా ఆయన ఉదహరించారు.

# యువతకు శాపంగా నిరుద్యోగం..

**- దేశంలో రోజుకు 10 మంది నిరుద్యోగుల బలవన్మరణం - నిరుద్యోగుల ఆత్మహత్యల్లో మహారాష్ట్ర టాప్ - రెండవ స్థానంలో కర్ణాటక - తెలంగాణలో నిరుడు 70 శాతం తగ్గుముఖం - పుదుచ్చేరి, లక్షద్వీప్‌లో ఒక్కటీ లేదు - వెల్లడించిన కేంద్రం నివేదిక**

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** నిరుద్యోగం యువతకు శాపంగా మారుతున్నది. మరణశాసనాన్ని రాస్తున్నది. దేశంలో ప్రతిరోజు సగటున 10మంది నిరుద్యోగులు ఆత్మహ్మత్యకు పాల్పడుతున్నట్టు కేంద్రం లోక్‌సభలో వెల్లడించింది. 2020-22 మధ్య మూడేండ్ల కాలంలోనే దేశవ్యాప్తంగా 10,259 మంది నిరుద్యోగం కారణంగా ప్రాణాలు వదిలారు. దాదాపు అన్ని రాష్ట్రాల్లోనూ నిరుద్యోగుల ఆత్మహత్యలు కలవరపెడుతున్నాయి. దేశవ్యాప్తంగా నమోదైన ఆత్మహత్యల్లో 20 శాతం ఒక్క మహారాష్ట్రలోనే జరుగుతున్నాయి. ప్రతి ఐదింటిలో ఒకటి ఇక్కడే నమోదువుతున్నది. అయితే కర్ణాటక, తమిళనాడు వరుసగా రెండు, మూడుస్థానాల్లో ఉన్నాయి.





## తెలంగాణలో 70 శాతం తగ్గుదల

ప్రధానమంత్రి నరేంద్రమోదీ సొంతరాష్ట్రం గుజరాత్ నిరుద్యోగుల ఆత్మహత్యల్లో నాలుగో స్థానంలో ఉండగా పైన చెప్పుకున్న కాలవ్యవధిలో అక్కడ 811 మంది నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకున్నారు. తెలంగాణలో మాత్రం నిరుద్యోగుల ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయి. ఇక్కడ ఈ మూడేండ్లలో 60 మంది మాత్రమే ప్రాణాలు కోల్పోగా . 2020లో 23 మంది, 2021లో 28 మంది, 2022లో 9 మంది ఆత్మహత్యలకు పాల్పడ్డారు. అంతకుముందు ఏడాదితో అంటే 2021తో పోల్చితే ఆత్మహత్యల్లో 70 శాతం తగ్గుదల కనిపించింది. దేశంలోని 28 రాష్ట్రాలతో పోల్చినప్పుడు తెలంగాణ స్థానం 20గా ఉంది.

## ఆశ్చర్యపరుస్తున్న బీహార్

రాష్ట్రాలపరంగా మణిపూర్‌లోఅతి తక్కువగా రెండు మరణాలు మాత్రమే నమోదు కాగా, నాగాలాండ్‌లో 8, అరుణాచల్‌ప్రదేశ్‌లో 12 మంది ప్రాణాలు తీసుకున్నారు. ఈ జాబితాలో అన్నింటికంటే ఆశ్చర్యపరిచిన రాష్ట్రం బీహార్. పేదరికం, నిరుద్యోగం తాండవించే ఇక్కడ 17 మంది మాత్రమే మరణించారు. ఉద్యోగం కోసం ఎదురుచూడకుండా దొరికిన పని చేసుకునే అలవాటు వల్లే ఇక్కడ ఆత్మహత్యలు తక్కువని నిపుణులు చెప్తున్నారు. యూపీలో 499 మంది నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకున్నారు.




## కేంద్రపాలిత ప్రాంతాల్లోనూ అదే తీరు

దేశంలోని 8 కేంద్రపాలిత ప్రాంతాల్లో ఆరింటిలో ఆత్మహత్యలు నమోదయ్యాయి. దేశ రాజధాని ఢిల్లీలో ఈ మూడేండ్లలో 698 మంది నిరుద్యోగులు ఆత్మహత్య చేసుకోగా, పుదుచ్చేరి, లక్షద్వీప్‌లలో ఒక్క ఆత్మహత్య కూడా నమోదు కాలేదు. అండమాన్, నికోబార్ దీవులతోపాటు లడఖ్‌లో గతేడాది ఒక్కోటి చొప్పున మరణాలు నమోదయ్యాయని కేంద్ర ప్రభుత్వ నివేదికలో వెల్లడైంది.

---

# మానవ అక్రమ రవాణా కేసులల తెలంగాణ టాప్!

**- హ్యూమన్ ట్రాఫికింగ్ కేసుల్లో తెలంగాణ టాప్ - గతేడాది రాష్ట్రంలో 391కేసుల నమోదు - 704 మందిని కాపాడిన పోలీసులు - దేశవ్యాప్తంగా 2250 కేసుల నమోదు - ఎన్సీబీ తాజా వివరాల్లో వెల్లడి**



**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** నేషనల్ క్రైమ్ రికార్డ్స్ బ్యూరో తాజా వివరాల ప్రకారం అత్యధిక మానవ అక్రమ రవాణా కేసులు నమోదవుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ టాప్‌లో నిలిచింది. గతేడాది దేశవ్యాప్తంగా 2250 కేసులు నమోదు కాగా 391 కేసులు తెలంగాణలో వెలుగు చూశాయి. ఈ కేసుల్లో 25 మంది బాలికలు, 9 మంది మంది బంగ్లాదేశ్ యువతులు, 641 మంది మహిళలు, 38 మంది బాలురుతో సహా మొత్తం 704 మందిని రాష్ట్ర పోలీసులు కాపాడారు. బాధితుల్లో కొందరిని రెస్క్యూ హోమ్స్‌కు బాలకార్మికులను తల్లిదండ్రుల వద్దకు చేర్చారు. మరికొందరిని చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులకు అప్పగించారు. 600 మందికి పైగా మహిళలు, 100 మంది చిన్నారులకు మెట్రో నగరాలకు అక్రమంగా తరలించినట్టు ఎన్సీబీ నివేదిక చెబుతోంది. బంగ్లాదేశ్, నేపాల్ దేశాలతో పాటూ ఇతర రాష్ట్రాల యువతులు, మైనర్లను అక్రమంగా రవాణా చేస్తున్నారు. తెలంగాణలో యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ బృందాలు క్రియాశీలకంగా ఉండటంతో నమోదవుతున్న కేసుల సంఖ్య పెరుగుతోంది.ఉద్యోగం, ఉపాధి, ప్రేమ పేరుతో ఇతర రాష్ట్రాల నుంచి యువతులను తెలంగాణకు రప్పిస్తున్నారు. చివరకు వ్యభిచార కూపాల్లో దించుతున్నారు. బీహార్, యూపీ సహా ఉత్తరాది రాష్ట్రాల నుంచి బాలకార్మికుల అక్రమ రవాణా సాగుతోంది. రాష్ట్రంలో మానవ అక్రమరవాణాకు చెక్ పెట్టేందుకు 30 ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి. కేంద్రం గైడ్‌లైన్స్ ప్రకారం సీఐడీ పోలీసులు, స్వచ్ఛంధ సంస్థలు, చైల్డ్ ప్రొటెక్షన్, లోకల్ పోలీసులు ఆపరేషన్ స్మైల్ పేరుతో దాడులు నిర్వహిస్తున్నారు.

# సాగు భూమికే రైతుబంధు

**- డిసెంబర్ చివరిలోగా రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తామన్న కాంగ్రెస్ సీనియర్ నేత - నిజమైన రైతులను గుర్తించేందుకు ప్రభుత్వం సమీక్ష చేస్తోందని వెల్లడి - గత ప్రభుత్వం ఖజానాను ఖాళీ చేసినా హామీలను నెరవేర్చుతామని దీమా**




**తెలంగాణ వీణ/హైదరాబాద్:** నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో 'రైతుబంధు' డబ్బులు ఎప్పుడు జమచేస్తుందనే చర్చ నడుస్తున్న వేళ పార్టీ సీనియర్ నేత, ఎమ్మెల్సీ టీ.జీ వన్ రెడ్డి ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. సాగుచేసే నిజమైన రైతులకే రైతుబంధు పెట్టుబడి సాయం అందజేసేలా ప్రభుత్వం సమీక్ష నిర్వహిస్తుందని అన్నారు. నిజమైన రైతుల ఖాతాల్లో డిసెం బరు చివరి నాటికి రైతుల అకౌంట్లలో ప్రభుత్వం డబ్బులు వేయనుందని పేర్కొన్నారు.ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చిన విధం గా ప్రతి ఎకరాకు రూ.7500 చొప్పున సాయం అందజే యనున్నామని చెప్పారు. కొందరు భూస్వాములు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు వందల ఎకరాలను సాగు భూములుగా చూపిస్తూ రైతు బంధు సాయం పొందుతున్నారని జీవన్ రెడ్డి విమర్శించారు. దీనిపై పునరాలోచన చేస్తామని, ధరణిలో తప్పొప్పులను పరిశీలించి హామీ ఇచ్చినట్టుగా సాగుభూమికే రైతుబంధు వచ్చేలా చేస్తామన్నారు.

6,490 స్కూళ్లల్లో

# సోలార్ ప్లాంట్లు

**- రూ.289.25 కోట్ల వ్యయం**
**- పాఠశాల విద్యాశాఖ నిర్ణయం**
**- టీఎస్ రెడ్‌కోకు బాధ్యతలు**



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** విద్యుత్తు బిల్లుల భారం నుంచి సర్కారు బడులకు విముక్తి కల్పించడంపై పాఠశాల విద్యాశాఖ దృష్టి సారించింది. అందులో భాగంగా రాష్ట్రంలోని 6,490 స్కూళ్లల్లో సోలార్ ప్లాంట్లు నెలకొల్పాలని నిర్ణయించింది. ఇందుకు రూ.289.25 కోట్ల నాబార్డు నిధులను ఖర్చుచేయనున్నది. స్కూళ్లలో సోలార్ ప్లాంట్ల ఏర్పాటు బాధ్యతను టీఎస్‌రెడ్‌కోకు అప్పగించింది. ఈ సంస్థ టెండర్లను పూర్తిచేశాక ఏజెన్సీలను ఎంపికచేసి ప్లాంట్ల ఏర్పాటు బాధ్యతలను అప్పగించనుంది. విద్యార్థుల సంఖ్య, పాఠశాల అవసరాలను బట్టి 2 నుంచి 10 కిలోవాట్ల సామర్థ్యం గల ప్లాంట్‌లను నెలకొల్పుతారు. ఒక్కో కిలోవాట్‌కు రూ.1 లక్ష చొప్పున ఖర్చుచేస్తారు. రాష్ట్రంలోని ఉన్నత పాఠశాలలతో పాటు తెలంగాణ మాడల్ స్కూల్స్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల్లోను కొత్తగా సోలార్ ప్లాంట్లను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ప్రభుత్వ, జిల్లా పరిషత్ బడుల్లో 5 కిలోవాట్లు, మాడల్ స్కూళు ,, కేజీబీవీల్లో 10 కిలోవాట్ల సామర్థ్యం గల ప్లాంట్లను నెలకొల్పుతారు. కేజీబీవీలు, మాడల్‌స్కూల్స్‌లో హాస్టల్స్‌ను కూడా నిర్వహిస్తుండటం వల్ల విద్యుత్తు వినియోగం అధికమవుతుండటంతో ప్లాంట్ల సామర్థ్యాన్ని పెంచారు.

## తప్పనున్న బిల్లుల భారం

ఇప్పటికే రాష్ట్రంలోని 11 జిల్లాల్లో 1,521 బడుల్లో మొత్తంగా 3,072 కిలోవాట్ల సామర్థ్యం గల సోలార్ ప్లాంట్లను అమర్చారు. ఇందుకు రూ.32.03 కోట్లను ఖర్చు కాగా ప్రస్తుతం ఆ ప్లాంట్లు విజయవంతంగా నడుస్తుండటంతో చాలా స్కూళ్లల్లో బిల్లుల భారం 50% మేరకు తగ్గింది. ఇదేవిధంగా హైస్కూళ్లు, కేజీబీవీలు, మాడల్ స్కూళ్లల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. గతంలో 'మన ఊరు-మన బడి' కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని ప్రభుత్వ బడుల్లో విద్యుత్తు ఉపకరణాలను అమర్చారు. ప్రతి తరగతి గదికి నాలుగు లైట్లు, నాలుగు ఫ్యాన్లు బిగించారు. అంతే కాకుండా పెద్ద ఎత్తున కంప్యూటర్ ల్యాబ్‌లను నెలకొల్పారు. డిజిటల్ విద్య అమలులో భాగంగా ఇటీవలే డిజిటల్ ఇంటరాక్టివ్ ప్యానళ్లను సైతం ఏర్పాటు చేశారు. దీంతో విద్యుత్తు వినియోగం అధికమై బిల్లులు అమాంతం పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే బిల్లల భారం నుంచి ప్రభుత్వ బడులకు విముక్తి కల్పించేందుకు సౌర విద్యుత్తును ఆశ్రయిస్తున్నారు.

# భూమి లాక్కుంటున్నారని పురుగుల మందు తాగిన దంపతులు

**తెలంగాణ వీణ/కోనరావుపేట:** తమ భూమిని అధికారులు లాక్కొంటున్నారని ఆవేదన చెందిన దళిత రైతు దంపతులు పురుగుల మందు తాగారు. వివరాల్లోకి వెళ్తే.. రాజన్న సిరిసిల్ల జిల్లా.. కోనరావుపేట మండలం.. కొండాపూర్ గ్రామానికి చెందిన మాల్యాల నందం జనశక్తి నక్సల్స్ సానుభూతిపరుడిగా పని చేశాడు. అప్పటి ప్రభుత్వం రెవెన్యూ అసైన్డ్ భూమి సర్వే నంబర్ 116 లో 1 ఎకరం 20 గుంటల భూమిని అప్పటి తహశీల్దార్ ఇచ్చారు. ఈ భూమిని సేద్యం చేస్తూ భార్య పద్మ,ఇద్దరు కూతుర్లు, కుమారుడిని పోషించుకుంటున్నాడు. 2021 సంవత్సరంలో మండలంలోని మల్కాపేట రిజర్వాయర్, కెనాల్ నిర్మించడంతో అందులో అటవీ భూమి పోవడంతో ప్రత్యామ్యాయంగా కొండాపూర్ గ్రామంలో ఉన్న రెవెన్యూ భూమిని అటవీ శాఖకు కేటాయిస్తూ ఉత్తర్వులు ఉన్నాయని రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు నందం భూమి వద్దకు వచ్చారు. హద్దులు ఏర్పాటు చేస్తున్న క్రమంలో దళితులమైన తమకు ఈ భూమే ఆధారమని, దీనిని లాక్కోవద్దని, తన ఇద్దరు బిడ్డలు, కొడుకు దిక్కులేని వారవుతారని అధికారులను వేడుకొన్నా వినలేదు. దీంతో గత్యంతరం లేని పరిస్థితుల్లో పొలంలోనే నందం, భార్య పద్మ పురుగుల మందు తాగారు. దీనిని గమనించిన అధికారులు, స్థానికులు వారిని హుటాహుటిన వారిని సిరిసిల్ల ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కాగా, దళితులకు ఉన్న కాస్త ఎకరం భూమి ప్రభుత్వ అధికారులు లాక్కోవడం సరికాదని, అటవీశాఖకు కేటాయించిన దళితుడి భూమిని వెంటనే జిఓ రద్దు చేయాలని దళిత సంఘాలు డిమాండ్ చేశాయి. దీనిపై కోనరావుపేట తహశీల్దార్ విజయ ప్రకాశ్ రావును వివరణ కోరగా ..ఇది 2021లో జరిగిన కేటాయింపు అని, తాను చేసింది కాదని, దీనిపై కలెక్టర్‌కి నివేదిక పంపిస్తామని అన్నారు.

### కేసీఆర్‌ను పరామర్శించిన

## సినీ నటుడు ప్రకాశ్ రాజ్



**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** యశోద ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను సినీ నటుడు ప్రకాశ్ రాజ్ పరామర్శించారు. ఈ సందర్భంగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి, కేసీఆర్ ఆరోగ్యపరిస్థితి గురించి ఆరా తీశారు. కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ప్రకాశ్ రాజ్ ఆకాంక్షించారు. మాజీ మంత్రులు గంగుల కమలాకర్, మల్లారెడ్డి, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్సీలు మధుసూదన చారి, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, మోత్కుపల్లి నర్సింహులు, బీఆర్ఎస్ నాయకుడు చల్మడ లక్ష్మి నరసింహారావు తదితరులు కూడా కేసీఆర్ ఆరోగ్యపరిస్థితి గురించి తెలుసుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

### స్పీకర్ ఎన్నికకు

## నోటిఫికేషన్ విడుదల



**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** తెలంగాణ శాసనసభ స్పీకర్ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈ నెల 14న ఉదయం 10.30 గంటలకు సభాపతి ఎన్నికను నిర్వహించనున్నారు. స్పీకర్ పదవికి పోటీపడే వారి నుంచి ఈ నెల 13న ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఈమేరకు అసెంబ్లీ సెక్రటేరియట్ నోటిఫికేషన్ విడుదల చేసింది.కాగా, కొత్తగా శాసనసభ శనివారం కొలువు దీరిన విషయం తెలిసిందే. నూతన సభ్యులతో ప్రొటెం స్పీకర్ అక్బరుద్దీన్ ఒవైసీ ప్రమాణ స్వీకారం చేయించారు. అయితే స్పీకర్‌గా వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్‌ను చేయాలని అధికార కాంగ్రెస్ పార్టీ ఇప్పటికే నిర్ణయించింది. అయితే స్పీకర్ ఎన్నిక ఏకగ్రీవం కావాలంటే ఒక్కరే నామినేషన్ రావాల్సి ఉంటుంది. ఇతర సభ్యులు ఎవరైనా పోటీలో ఉంటే బ్యాలెట్ ద్వారా స్పీకర్‌ను ఎన్నుకోనున్నారు. స్పీకర్ ఎన్నిక ప్రొటెం స్పీకర్ ఆధ్వర్యంలో జరుగనుంది.

## ఆర్యవైశ్య మహాసభ నూతన భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే కేపీ.వివేకానంద



**తెలంగాణ వీణ/కుత్బుల్లాపూర్:** జగద్గిరిగుట్టలో నూతనంగా నిర్మించిన మేడ్చల్ జిల్లా ఆర్యవైశ్య మహాసభ నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఈరోజు ఎమ్మెల్యే కేపీ.వివే కానంద ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జగన్,డివిజన్ అధ్యక్షులు రుద్ర అశోక్,శ్రీ వెంకటేశ్వర దేవస్థానం చైర్మన్ వేణు యాదవ్, సీనియర్ నాయకులు రషీద్ భాయ్,జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు పార్శి ప్రకాష్ గుప్త,ప్రధాన కార్యదర్శి ఉప్పల చంద్రశేఖర్ గుప్త, అదనపు ప్రధాన కార్యదర్శి యెర్రం శ్రీనివాస్ గుప్త, కోశాధికారి ధారం సతీష్ గుప్త, కార్యక్రమ నిర్వాహకులు తేరాల శ్రీనివాస్ గుప్త,శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం ట్రస్ట్ చైర్మన్,శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం డైరెక్టర్ రేగూరి ప్రవీణ్ కుమార్ గుప్తా,శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం గౌరవ చైర్మన్ కాచం కైలాసం గుప్త,అధ్యక్షులు ఉప్పల రమేష్ గుప్త, ఉపాధ్య క్షులు నేతి శంకర్ గుప్త, కార్యదర్శి చిగుళ్లపల్లి లక్ష్మణరావు గుప్త,కోశాధికారి మహంకాళి సురేష్ గుప్త, వర్కింగ్ ప్రెసిడెంట్ యాద నరేందర్ గుప్త,గంజి స్వామి గుప్త, అంగడి సత్యనా రాయణ గుప్త,లక్ష్మీ నరసయ్య గుప్త, శేర్విరాల కృష్ణమూర్తి గుప్త, ఆర్యవైశ్య సంఘం సభ్యులు, కుల బాంధవులు పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు రేవంత్ సర్కార్ గుడ్ న్యూస్..

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయాలతో పాలనలో దూకుడుగా వ్యవహరిస్తున్నారు. సర్కారు కొలువుదీరిన మొదటి రోజు నుంచే తనదైన మార్క్ పాలన కనబ రిచే ప్రయత్నం చేస్తున్నారు. తొలిరోజే కేబినెట్ భేటీ నిర్వహించి ఆరు గ్యారెంటీలతో పాటు కీలక విషయాలపై చర్చించారు. ఆ తర్వాత రోజే ప్రజా భవన్‌లో ప్రజాదర్బార్ నిర్వహించి తమది ప్రజా ప్రభుత్వమని జనాల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. ఇక మూడో రోజునే కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో రెండు గ్యారెంటీల్లోని రెండు పథకాలను అమలు చేసి సోనియాగాంధీ పుట్టిన రోజునే తెలంగాణ మహిళలకు గిఫ్ట్ ఇచ్చారు. మరోవైపు రాష్ట్రంలోని ఆర్థిక పరిస్థితి, కరెంట్ పరిస్థితులపై శ్వేతపత్రం విడుదల చేయాలంటూ అధికారులను ఉరుకులు పెట్టిస్తున్నారు. ఈ నేపథ్యంలో నిరుద్యోగులకు రేవంత్ సర్కారు తీపి కబురు విని పించింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నిరుద్యోగులను పూర్తిగా నిర్లక్ష్యం చేశారని నియామకాల విషయంలో ఇచ్చిన హామీలను




తుంగలో తొక్కి యువతను మోసం చేశారంటూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేసిన రేవంత్ రెడ్డి ఇప్పుడు సీఎం అయిన నేపథ్యంలో కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ అంశంపై దృష్టి సారించిన రేవంత్ రెడ్డి రెండు రోజుల్లో సమీక్ష నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ మేరకు రాష్ట్రంలో ఉన్న ఖాళీల భర్తీకి సంబంధించిన పూర్తి వివరాలను తీసుకోని రివ్యూ మీటింగ్‌కు హాజరుకావాలని టీఎ?స్‌పీఎస్సీ ఛైర్మన్ బి.జనార్దన్ రెడ్డికి ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణ ఏర్పడిన 2014 ఏడాది నుంచి టీఎస్‌పీఎస్సీ ద్వారా భర్తీ చేసిన ఉద్యోగాలు, నోటిఫికేషన్‌లకు సంబంధించిన పూర్తి వివరాలతో సమీక్షకు రావాలని ఆదేశించారు. ఇదిలా ఉంటే, ఏడాదిన్నర నుంచి రాష్ట్రంలో పలు పేపర్ల లీక్ వ్యవహారం, పరీక్షల వాయిదాల పర్వంతో నియామకాల విషయంలో ప్రతిష్టంభన కొనసాగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో కొత్త సర్కారు ఎలాంటి నిర్ణయం తీసుకోనుంది? వాయిదా పడిన పరీక్షలను వెంటనే నిర్వహిస్తుందా లేదా? టీఎస్పీఎస్సీ బోర్డును పూర్తిగా ప్రక్షాళణ చేసిన తర్వాత నిర్వహిస్తుందా? అన్నది సర్వత్రా ఆసక్తికరంగా మారింది.

# గిరిజనుడి లాకప్‌డెత్!

**- భూవివాదం విచారణలో వ్యక్తి మృతి**
**- నల్లగొండ జిల్లా చింతపల్లిలో ఘటన**
**- పోలీసులు కొట్టడం వల్లేనని సూర్యానాయక్ బంధువుల ఆందోళన**
**- హెడ్ క్వార్టర్‌కు చింతపల్లి ఎస్సై అటాచ్**

**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** గిరిజనుడి లాకప్‌డెత్ జరిగిన సంఘటన ఆదివారం నల్లగొండ జిల్లా చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో చోటుచేసుకుంది .చింతపల్లి మండలం పాలెంతండాకు చెందిన సూర్యానాయక్(50)కు ఆయన సోదరుడికి మధ్య కొంత కాలంగా భూవివాదం కొనసాగుతుండడంతో అన్నదమ్ములిద్దరూ ఒకరిపై ఒకరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. ఎస్సై సతీశ్‌రెడ్డి ఆదివారం సాయంత్రం సూర్యనాయక్‌తోపాటు అతని సోదరుడిని పోలీస్ స్టేషన్‌కు పిలిచి విచారణ జరిపారు. ఈ క్రమంలో సూర్యనాయక్ హైబీపీతో స్టేషన్‌లోనే కిందపడిపోయాడు. వెంటనే అతడిని బంధువులు, పోలీసులు దేవరకొండ ప్రభుత్వ దవాఖానకు తరలించగా, చికిత్స పొం దుతూ దురదృష్టవశాత్తు అక్కడే మరణించాడు. సూర్యనాయక్‌ను విచారిస్తుండగా బీపీతో పడిపోయాడని ఎస్సై సతీశ్‌రెడ్డి తెలపగా. పోలీసులు కొట్టడం వల్లే సూర్యనాయక్ చనిపోయాడని అతడి బంధువులు ఆరోపించారు. ఈ ఘటనపై ఎస్పీ అపూర్వరావు స్పందించి విచారణ జరుపుతున్నామని తెలిపారు. ఎస్సై సతీశ్‌రెడ్డిని ముందుగా నల్లగొండ హెడ్ క్వార్టర్స్‌కు అటాచ్ చేసినట్టు ఎస్పీ పేర్కొనడంతో వారు ఆందోళన విరమించారు. పోస్ట్‌మార్టం కోసం మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచారు.



# సంగారెడ్డి జిల్లాలో విషాదం

**- వ్యవసాయ బావిలో పడి యువకుడు మృతి**



**తెలంగాణ వీణ/హైదరాబాద్:** కుటుంబ తగాదాలతో మనస్థాపం చెందిన ఓ యువకుడు బావిలో దూకి బలవన్మరణానికి పాల్పడ్డాడు ఈ విషాదకర సంఘటన సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం అర్జున్ నాయక్ తండాలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు తండాకు చెందిన రాథోడ్ సందీప్ (23) కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. దీంతో మనస్థాపం చెందిన సందీప్ వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు తండా వాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఒక బాబు, పాప ఉన్నట్లు తెలిపారు. మృతుడి కుటుంబా సభ్యుల ఫిర్యాదు మేరకు జహీరాబాద్ రూరల్ పోలీసులు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నారు. సందీప్ మృతితో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరగా కోలుకోవాలని పూజలు



**తెలంగాణ వీణ/కీసర:** బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆరోగ్యం త్వరగా కోలుకో వాలని నాగారం మున్సిపల్ నాయకులు ఆలయంలో ప్రత్యేక నిర్వహించారు. మున్సిపల్ ఛైర్మన్ కౌకు ంట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో సత్యనారాయణ కాలనీ లోని శ్రీ రమా సత్యనారాయణ స్వామి, శ్రీ షిర్డీ సాయిబాబా దేవస్థానం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ చంద్రారెడ్డి మాట్లాడుతూ.. యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కేసిఆర్ త్వరగా డిశ్చార్జి కావాలనీ, ఆల యన ఆరోగ్యం మెరుగుపడి ప్రజా సమస్యలపై స్పందించాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శ్రీధర్,ఆలయకమిటీ చైర్మన్ అన్నంరాజు శ్రీనివాస్, బీఆర్ఎస్ నాయకులు నిమ్మల శ్రీనివాస్ యూత్ అధ్యక్షుడు నరేందర్ రెడ్డి, వీరన్న, శ్రీనివాస్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు కొమిరెల్లి సుధాకర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యుడు సాయినాథ్ గౌడ్‌లు పాల్గొన్నారు.

## మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఘన స్వాగతం పలికిన తుంకుంట కాంగ్రెస్ నేతలు



**తెలంగాణ వీణ/మేడ్చల్ ప్రతినిధి:** రాష్ట్ర రవాణా,బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు తూంకుంట మున్సిపల్ పరిధిలోని మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దేవరయా ంజాల్,తూంకుంట కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఘన స్వాగతంతో సత్కరించి శు భాకాంక్షలు తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్,జగ్జీవన్ రామ్,రాజీవ్ గాంధీ,డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి గెలిపించి ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశం కల్పించిన ప్రజలందరికీ అదే విధంగా కష్టపడిన కాంగ్రెస్ నాయకులకు,కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపి,కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలలో రెండు గ్యారెంటీలను ప్రవేశపెట్టినాము మిగతావి పథకాలు త్వరలోనే ప్రజలకు అందజేస్తామని తెలిపారు.అనంతరం తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి నివాసంలో ఏర్పాటు చేసిన విందుకు తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే,సిద్దిపేట జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి,దుబ్బాక నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ చెరుకు శ్రీనివాస్ రెడ్డి తదితరులు విచ్చేసినారు.ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి బాలేష్,టిపిసిసి కార్యదర్శి మహిపాల్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు పత్తి కుమార్, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు సురేష్ నాయక్,తూంకుంట మున్సిపల్ కౌన్సిలర్లు మధుసూదన్ రెడ్డి,పూజ భరత్ సింగ్,నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి కొండా సురేఖ దంపతులను కలిసిన కాంగ్రెస్ నాయకులు



**తెలంగాణ వీణ/ఉప్పల్ :** తెలంగాణ రాష్ట్ర అటవీ, దేవాదాయశాఖ మంత్రిగా పదవీ భాద్యతలు చేపట్టిన శ్రీమతి కొండ సురేఖను కాప్రా సర్కిల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కలసి అభినందనలు తెలిపారు. ఆదివారం మంత్రి కొండ సురేఖ నివాసంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు బుడిద శ్రావన్కుమార్ గౌడ్, మీర్పేట్ హెచ్బి కాలనీ డివి జన్ కాంటెస్టెడ్ కార్పొరేటర్ పోలేపాక అంజయ్య, కాంగ్రెస్ నాయకులు పోలేగౌని శ్రావన్కుమార్ గౌడ్లు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్ర మంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఇంజమల్లేశం, ఎండి అహ్మద్ తది తరులు పాల్గొన్నారు.

## 'గుంటూరు కారం' నుంచి 'ఓ మై బేబీ' సాంగ్ ప్రోమో విడుదల



తెలంగాణ వీణ , సినిమా : సూపర్ స్టార్ మహేశ్ బాబు హీరోగా త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం గుంటూరు కారం. తాజాగా ఈ చిత్రం నుంచి ఓ మై బేబీ అనే పాట ప్రోమో రిలీజైంది. పూర్తి లిరికల్ వీడియోను ఈ నెల 13న విడుదల చేయనున్నట్టు చిత్రబృందం వెల్లడించింది. ఓ మై బేబీ గీతానికి తమన్ బాణీలు సమకూర్చగా, రామజోగయ్యశాస్త్రి సాహిత్యం అందించారు. గాయని శిల్పా రావు ఆలపించారు. గుంటూరు కారం చిత్రంలో మహేశ్ బాబు సరసన శ్రీలీల, మీనాక్షి చౌదరి కథానాయికలు. ఈ భారీ చిత్రం సంక్రాంతి కానుకగా 2024 జనవరి 12న ప్రేక్షకుల ముందుకు వస్తోంది.

## 'ఆపరేషన్ వాలెంటైన్' వచ్చేది అప్పుడే



మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హిందీలో అరంగేట్రం చేస్తున్న చిత్రం 'ఆపరేషన్ వాలెంటైన్' సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్ లో ఒక విజువల్ వండర్‌గా ఉండబోతోంది. యదార్ధ సంఘటన స్ఫూర్తితో రూపొందుతున్న ఈ చిత్రంలో వరుణ్ తేజ్ ఇండియన్ ఎయిర్ పైలట్‌గా కనిపించనున్నారు. రాడార్ ఆఫీసర్ పాత్రలో మానుషి చిల్లార్ నటిస్తున్నారు. సినీ ప్రేక్షకులకు గొప్ప సినిమా అనుభూతిని కల్పిస్తామని నిర్మాతలు ఇటీవల ఈ చిత్రాన్ని వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఇప్పుడు మోషన్ టీజర్‌తో సినిమా రిలీజ్ డేట్ ను ప్రకటించారు. 'ఆపరేషన్ వాలెంటైన్' ఫిబ్రవరి 16న గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ చిత్రాన్ని సోనీ పిక్చర్స్ ఇంటర్నేషనల్ ప్రొడక్షన్స్, రినైసన్స్ పిక్చర్స్ బ్యానర్‌లపై సందీప్ ముద్దా నిర్మించారు. అనుభవజ్ఞుడైన యాడ్-ఫిల్మ్ మేకర్, సినిమాటోగ్రాఫర్, వీఎఫ్ఎక్స్ నిపుణుడు శక్తి ప్రతాప్ సింగ్ హడా ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈ చిత్రం తెలుగు, హిందీ భాషలలో విడుదల కానుంది.

## 'పిండం' చూసి భయపడతారు



ప్రముఖ హీరో శ్రీరామ్, ఖుషీ రవి జంటగా నటించిన చిత్రం 'పిండం'. ఈ సినిమాతో సాయికిరణ్ దైదా దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. కళాహి మీడియా బ్యానర్‌పై యశ్వంత్ దగ్గుమాటి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా ఈనెల 15వ తేదీన ప్రపంచవ్యాప్తంగా భారీగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లో ప్రీ-రిలీజ్ ప్రెస్ మీట్ ను నిర్వహించిన చిత్ర బృందం సినిమా విశేషాలను పంచుకుంది. ఈ సమావేశంలో కథానాయకుడు శ్రీరామ్ మాట్లాడుతూ.. "పిండం సినిమా ఏంటి అనేది ఈనెల 15న తెలుస్తుంది. ఈ చిత్రం అందరికీ ఖచ్చితంగా నచ్చుతుంది"అని అన్నారు. దర్శకుడు సాయికిరణ్ దైదా మాట్లాడుతూ "నల్గొండ జిల్లాలో జరిగిన ఒక యదార్ధ ఘటనను తీసుకొని, దాని చుట్టూ కల్పిత కథ అల్లుకొని, దీనిని హారర్ జానర్‌లో చెబితే బాగుంటుందనే ఆలోచనతో పిండం కథను రాసుకున్నాము. ప్రేక్షకులు ఖచ్చితంగా ఈ సినిమా చూసి భయపడతారు"అని తెలిపారు. నిర్మాత యశ్వంత్ దగ్గుమాటి మాట్లాడుతూ ఈనెల 15న మా పిండం సినిమా ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదలవుతుందని చెప్పారు. ఈ సమావేశంలో కథానాయిక ఖుషి రవి, సంగీత దర్శకుడు కృష్ణ సౌరభ్ సూరంపల్లి, సిద్ధార్థ, సతీష్ మనోహర్ తదితరులు పాల్గొన్నారు.


## 'నా సామిరంగ' నుంచి పెప్పీ మెలోడీ..

కింగ్ నాగార్జున అక్కినేని పర్ఫెక్ట్ సంక్రాంతి మూవీ 'నా సామిరంగ'తో ప్రేక్షకుల ముందకు రాబోతున్నారు. ఈ చిత్రం షూటింగ్ చివరి దశలో ఉంది. పండుగకు గొప్ప ట్రాక్ రికార్డ్ ఉన్న నాగార్జున, విజయ్ బిన్నీ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రంలో మ్యాసీ, రగ్గడ్ అవతార్‌లో కనిపించనున్నారు. మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై నిర్మాత శ్రీనివాస చిట్టూరి మ్యాసీవ్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. పవన్ కుమార్ ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నారు.ఆస్కార్ అవార్డ్- విన్నింగ్ కంపోజర్ ఎంఎం కీరవాణి, ఆస్కార్ విన్నింగ్ లిరిసిస్ట్ చంద్రబోస్ నాగార్జునకు మరో చార్ట్‌బస్టర్ ఆల్బమ్‌ను అందించడానికి మరొకసారి పని చేస్తున్నారు. మేకర్స్ మొదటి సింగిల్ 'ఎత్తుకెళ్లి పోవాలనిపిస్తుంది' పాట విడుదల చేయడంతో మ్యూజిక్ ప్రమోషన్స్ గ్రాండ్‌గా ప్రారంభమయ్యాయి. ఎంఎం కీరవాణి మైమరించే మెలోడీని స్కోర్ చేసారు. రామ్ మిరియాల తన వోకల్స్‌తో కట్టిపడేశారు. చంద్రబోస్ మెలోడీ చార్ట్‌బస్టర్‌గా నిలిపే సాహిత్యాన్ని అందించారు. నాగార్జున, ఆషికా రంగనాథ్‌ల కెమిస్ట్రీ అందరినీ ఆకట్టుకుంటుంది.ఎప్పటిలాగే నాగార్జున తన హ్యాండ్సమ్ లుక్స్‌తో అందరి హృదయాలను కొల్లగొట్టగా, హీరోయిన్ ఆషికా సాంప్రదాయక గెటప్‌లో ఆకట్టుకుంది. పాటలో విజువల్స్ గ్రాండ్‌గా ఉన్నాయి. ఖచ్చితంగా ఈ పెప్పీ మెలోడీ చార్ట్-టాపింగ్ హిట్ అవుతుంది. 2024 సంక్రాంతికి థియేటర్లలో విడుదల కానున్న ఈ చిత్రానికి బ్లాక్ బస్టర్ రచయిత ప్రసన్న కుమార్ బెజవాడ కథ, మాటలు అందించారు.



## క్రికెట్‌లో మరో కొత్త రూల్

దుబాయి: అంతర్జాతీయ క్రికెట్‌లో మరో కొత్త రూల్‌ను ఐసిసి ప్రవేశ పెట్టనుంది. ఈ కొత్త రూల్ మంగళవారం నుంచి అమల్లోకి రానుంది. స్టాప్ క్లాక్ పేరుతో ఐసిసి సరికొత్త నిబంధనను ప్రవేశపెట్టనుంది. ఈ నిబంధన ప్రకారం బౌలింగ్ జట్టు తన తర్వాతి ఓవర్‌లోని మొదటి బంతిని అంతకు మునుపటి ఓవర్ పూర్తయిన 60 సెకన్ల లోపే వేయడానికి సిద్ధంగా ఉండాలి. అలా చేయకపోతే రెండు సార్లు స్లో ఓవర్ వార్నింగ్ ఇస్తారు.



## క్రికెట్‌కు అసద్ షఫిక్ గుడ్‌బై



కరాచీ: పాకిస్థాన్ స్టార్ క్రికెటర్ అసద్ షఫిక్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. 37 ఏళ్ల షఫిక్ మూడు ఫార్మాట్ల క్రికెట్ నుంచి తప్పుకుంటున్నట్టు సోమవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. అంతర్జాతీయ క్రికెట్‌లో కొనసాగాలని భావించినా ఫిట్‌నెస్ సహకరించడం లేదన్నాడు. కొంత కాలంగా పాకిస్థాన్ జట్టులో కూడా చోటు లభించడం లేదని, ఇలాంటి స్థితిలో ఆట నుంచి తప్పుకోవడమే మంచిదని నిర్ణయించనట్టు వెల్లడించారు. తాను చివరిసారిగా 2020లో పాకిస్థాన్ జట్టుకు ప్రాతినిథ్యం వహించానన్నాడు. ఆ తర్వాత తనకు మరో ఛాన్స్ దక్కలేదన్నాడు. దీంతో ఆటను తప్పుకోవాలని నిర్ణయానికి వచ్చానన్నాడు. మూడు ఫార్మాట్‌లకు కూడా వీడ్కోలు పలికాలని తెలిపాడు. సుదీర్ఘ కెరీర్‌లో తనకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించానని పేర్కొన్నాడు. పాకిస్థాన్ జట్టుకు ప్రాతినిథ్యం వహించడాన్ని గర్వంగా భావిస్తున్నట్టు షఫిక్ వెల్లడించాడు. కాగా, 2010లో అంతర్జాతీయ క్రికెట్‌కు శ్రీకారం చుట్టిన షఫిక్ 77 టెస్టులు, 60 వన్డేలు, మరో పది టి20 మ్యాచ్‌లలో పాకిస్థాన్‌కు ప్రాతినిథ్యం వహించాడు.

## రింకును కోతి కరవడంతో అలా చేస్తాడు...



హైదరాబాద్: టీమిండియాలో టి20 జట్టు అంతా కుర్రాళ్లతో నిండిపోయింది. ఆస్ట్రేలియాతో జరిగిన సిరీస్లో సూర్యకుమార్ కెప్టెన్సీలో కుర్రాళ్లు ధనాధన్ బ్యాటింగ్ చేసి అలరించారు. ప్రతి టి20లోను 200 పైగా పరుగులు చేసి ధాటిగా ఆడారు. టీమిండియా బ్యాట్స్‌మెన్ రింకుసింగ్ చివరలో దంచికొడుతున్నారు. బ్యాటింగ్‌లో అదరగొట్టడమే కాకుండా ఫీల్డింగ్ మెరుపులు మెరిపిస్తున్నాడు. దక్షిణాఫ్రికా టూర్‌లో టీమిండియా జట్టు సభ్యుడు రింకు బిసిసిఐ ఇంటర్వ్యూలో మాట్లాడాడు. రింకు వేగంగా కదలడానికి కారణం కోతి కరవడమే కారణమని శుభ్‌మన్ గిల్ సరదాగా వెనుక నుంచి వ్యాఖ్యానించడంతో అందరూ నవ్వుకున్నారు. భారత్ వికెట్లతో పోలిస్తే సఫారీల గడ్డ మీద బౌన్స్ అధికంగా ఉండడంతో పాటు పేస్ కూడా ఎక్కువగా ఉంటుందని రింకు చెప్పారు. కోచ్ రాహుల్ ద్రావిడ్ కలిసి పని చేయడం గొప్పగా అనిపించడంతో పాటు తనదైన శైలిలో ఆడమని సలహాలు ఇస్తాడని, స్వీయ నమ్మకం ముఖ్యమని పలుమార్లు చెప్పాడని గుర్తు చేశారు. బ్యాటింగ్‌లో ఐదు, ఆరు స్థానాల్లో ఆడటం కష్టమని, నమ్మకంతో ముందుకు సాగాలని చెప్పారు. దేశవాళీ క్రికెట్‌లో ఉత్తరప్రదేశ్ నుంచి ఐదు, ఆరు స్థానాల్లో ఆడి రింకు గొప్పగా రాణించారు. నాలుగు ఐదు వికెట్లు పడిన తరువాత భాగస్వామ్యం రింకు నమోదు చేయడంతో పాటు కఠినమైన పట్టుదలతో సాగుతాడని, ఎంతో ప్రశాంతంగా ఉంటే అంతా బాగా ఆడగలనని అతడు చెప్పాడు.

## ఫైనల్లో ఓటమి.. ప్రియురాలితో బ్రేకప్ లాంటిది

దర్బన్: భారత్ వేదిక జరిగిన వన్డే వరల్డ్ కప్ ఫైనల్లో టీమిండియా ఓటమిపాలైన సంగతి తెలిసిందే. వరుస విజయాలతో టైటిల్ ఫైట్‌కు చేరిన భారత్ ఆస్ట్రేలియాపై ఓటమితో కప్ చేజార్చుకుంది. అయితే ఓ ఫైనల్ మ్యాచ్‌లో భారత్ ఓటమిపై సౌతాఫ్రికా స్టార్ ఆటగాడు, మాజీ సారధి డుప్లెసిస్ కీలక వ్యాఖ్యలు చేశాడు.ఫాఫ్ డూప్లెసిస్ ఎన్‌డిటివితో మాట్లాడుతూ.. '2015లో జరిగిన వరల్డ్ కప్ మా జట్టు టోర్నీ అంతా అద్భుతంగా ఆడి విజయాలు సాధించి సెమీస్‌కు చేరామని, సెమీస్‌లో మాకు ఊహించలేని ఓటమి ఎదురైందని, భారత్ సొంత గడ్డపై ఓటమి కూడా అంత తేలికగా మరవలేదని, ఇంకొంచెం సమయం పడుతుందని, ఈ ఓటమి ప్రియురాలితో విడిపోవడం వంటిదని, వెంటనే దీనిని మరిచిపోలేం' అని డూప్లేసిస్ 2015 వరల్డ్ కప్‌లో తమ జట్టు ఓటమిని గుర్తుచేసుకున్నాడు.





## తెలంగాణలో 'ప్రజావాణి' కార్యక్రమం..

- సమస్యలపై ప్రజల అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్లు, ఎమ్మెల్యేలు
- కార్యక్రమంపై తరచూ సమీక్ష జరగాలంటున్న ప్రజలు
- జిల్లా స్థాయి అధికారులు కార్యక్రమంలో పాల్గొంటే సమస్యలు పరిష్కారమవుతాయని సూచన




**తెలంగాణ వీణ/హైదరాబాద్:** తెలంగాణ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రేవంత్ రెడ్డి మొదటి రోజే ప్రజాదర్బార్ నిర్వ హించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలో ప్రజాసమస్యల పరిష్కారం కోసం నిన్నటినుండి ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించింది రాష్ట్రప్రభుత్వం. ఈ కార్యక్రమంలో జిల్లాల వారీగా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్నారు. రాష్ట్ర స్థాయిలో పరిష్కరించాల్సిన సమస్యలు రాష్ట్ర స్థాయి అధికారులకు పంపుతున్నారు. ఇంతకుముందు మొక్కుబడిగా సాగాయన్న ఆరోపణలు ఉన్నాయి. అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు వస్తేనే తమ సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయన్న ప్రజలు, దిగువస్థాయి అధికారులతో ఆశించిన ప్రయోజనం దక్కదని చెబుతున్నారు. అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలు, వాటికి లభించిన పరిష్కాలపై తరచూ సమీక్ష జరగాలని కూడా ప్రజలు కోరుతున్నారు.

## మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణకు ఆత్మీయ వీడ్కోలు



**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణకు సిబ్బంది ఆత్మీయ వీడ్కోలు పలికారు. దశాబ్ద కాలం పాటు తనతో పని చేసిన సిబ్బందిని కలిసి వారితో ముచ్చటించి వీడ్కోలు తీసుకుందామని వెళ్లిన అల్లం నారాయణకు సిబ్బంది నిండైన హృదయంతో... బరువైన గుండెలతో... వీడ్కోలు పలికారు. తెలంగాణ రాష్ట్ర తొలి మీడియా అకాడమీ చైర్మన్ గా బాధ్యతలు స్వీకరించి తొమ్మిదిన్నరేళ్ల సుదీర్ఘ ప్రయాణంలో అనునిత్యం జర్నలిస్టుల సంక్షేమమే పరమావధిగా పని చేసిన అల్లం నారాయణ మీడియా అకాడమీ చైర్మన్ గా పదవీ విరమణ చేశారు.తెలంగాణ ప్రభుత్వాన్ని ఒప్పించి మెప్పించి తెచ్చిన 42 కోట్ల సంక్షేమ నిధితో దాదాపు 18 కోట్ల రూపాయల నిధులను తెలంగాణ జర్నలిస్టుల సంక్షేమం కోసం ఖర్చుపెట్టారు. గత ఏడేళ్లుగా మరణించిన దాదాపు 500 మంది జర్నలిస్టు కుటుంబాలకు లక్ష రూపాయలు ఇవ్వటమే కాకుండా, నేటికీ నెలకు మూడు వేల చొప్పున పెన్షన్ ఇచ్చి వారి కుటుంబాలకు అండగా నిలిచారు. కరోనా కష్టకాలంలో దాదాపు ఏడు కోట్ల రూపాయలను జర్నలిస్టులకు సత్వర సహాయం కింద విడుదల చేశారు. సాహిత్య పరంగా ఆరు పుస్తకాలను ప్రింట్ చేసి భావి జర్నలిస్టుల కోసం, వారి శిక్షణకు సహాయపడేలా అందుబాటులోకి తెచ్చారు. తెలంగాణలోని అన్ని జిల్లా కేంద్రాలలో జర్నలిస్ట్ శిక్షణ తరగతులు ఏర్పాటు చేసి దాదాపు పదివేల మంది జర్నలిస్టుల కు పైగా శిక్షణను ఇప్పించారు.చివరగా దాదాపు 15 కోట్ల రూపాయల నిధులతో శాశ్వత మీడియా అకాడమీ భవనాన్ని తన హయాంలో భవిష్యత్ తరాల కోసం నిర్మించిన తీరు అభినందనీయం. కంప్యూటర్ శిక్షణ ద్వారా జర్నలిజం కోర్స్ పెట్టాలని ఒక ప్రత్యేక హాలు నిర్మించడంతో పాటు, ఆడిటోరియం నిర్మాణం చూస్తే నిజంగా ముచ్చటేస్తుంది. కాగా నిర్మించిన హాల్లో ఎంతో గొప్పగా శిక్షణ తరగతులు నిర్వహించే అవకాశం ఉంటుంది. ఆ నిర్మాణాన్ని చూస్తేనే తెలుస్తుంది తెలంగాణ జర్నలిస్టులకు ఎంతో చేయాలనే తపన, ఒక విజన్ అల్లం నారాయణకి మాత్రమే ఉందని... దానిని చూసిన ఎవరైనా ఒప్పుకోక తప్పదేమో.

# తెలంగాణ భవన్‌పై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నెక్స్ట్ ఫోకస్...

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** రాష్ట్రంలో అధికార మార్పిడి అనంతరం ఒక్కో శాఖపై సమీక్ష జరుపుతున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలో ఢిల్లీలోని తెలంగాణ భవన్ విషయాన్నీ టేకప్ చేయాలనుకుంటున్నారు. దాదాపు పదేండ్లుగా అక్కడ ప్రత్యేక ప్రతినిధి (స్పెషల్ రిప్రజెంటేటివ్) వ్యవస్థ కొనసాగుతూ ఉన్నదని, దాని ద్వారా ఒనగూరిన ప్రయోజనాలేమీ లేకపోయినా ప్రతి నెలా జీతం, అలవెన్స్ తదితర రూపాల్లో ఆర్థిక భారమే పడుతున్నదనే అభిప్రాయం ఉంది. సీఎంగా బాధ్యతలు తీసుకున్న తర్వాత రెండురోజుల క్రితం ఫస్ట్ టైమ్ ఢిల్లీ వెళ్లిన తర్వాత అక్కడి రెసిడెంట్ కమిషనర్‌తో ప్రాథమిక స్థాయిలో తెలంగాణ భవన్ విధివిధానాలు, పనితీరు, ప్రయోజనం లేకుండా కంటిన్యూ అవుతున్న విభాగాలు తదితరాలను ప్రస్తావించినట్లు సమాచారం.

### ఫలితాలు రాకున్నా కొనసాగింపు...

ఢిల్లీలోని తెలంగాణ భవన్ ప్రభుత్వ వ్యవస్థగా పనిచేయడం కంటే బీఆర్ఎస్ పార్టీ పునరావాస కేంద్రంగా మారిందనే సాధారణ అభిప్రాయం నెలకొన్నది. ఆ పార్టీతో సంబంధాలు ఉన్న వ్యక్తులను వేర్వేరు పదవుల్లో అక్కడ నియమించడం, కాంట్రాక్టు/ఔట్‌సోర్సింగ్ పద్ధతుల్లో అపాయింట్ చేయడం, ఆ విభాగాలకు నిర్దిష్టమైన టాస్క్ ఉన్నా ఫలితాలు మాత్రం ఆశించిన తీరులో లేకపోవడం, అయినా అవి కొనసాగుతూనే ఉండడం.. ఇలాంటి అంశాలన్నీ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఇప్పుడు తెరమీదకు వస్తున్నాయి. భవన్ వ్యవహారాలను సెక్రటేరియట్‌లోని సాధారణ పరిపాలన



శాఖ (జీఏడీ) సీరియస్‌గా పర్యవేక్షించకపోవడంతో అదో ప్రత్యేక వ్యవస్థగానే కొనసాగుతున్నది. హైదరాబాద్ స్థాయిలో పరిపాలనను గాడిన పెట్టిన తర్వాత ఢిల్లీ తెలంగాణ భవన్ సంగతి చూద్దామనే భావన అధికారుల్లో ఉన్నది.

### ప్రయోజనం లేని వ్యవస్థ..

రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రత్యేక ప్రతినిధులుగా రామచంద్రు తేజావత్, వేణుగోపాలచారి, కేఎం సాహ్నిలను ప్రభుత్వం నియమించింది. రాష్ట్రానికి సంబంధించిన అంశాలను కేంద్ర ప్రభుత్వంలోని సంబంధిత శాఖలతో సమన్వయం చేసుకుని నిధులు, అనుమతులు తెప్పించడంతోపాటు రెండు ప్రభుత్వాల మధ్య వారధిగా పనిచేసేలా ఈ వ్యవస్థను ఏర్పాటు చేసింది. రామచంద్రు తేజావత్, వేణుగోపాలచారి పదవీకాలం ముగియడంతో తప్పుకున్నారు. కానీ కేఎం సాహ్ని మాత్రం ఇప్పటికీ కొనసాగుతున్నారు. నెలకు లక్ష రూపాయల జీతంతో పాటు ప్రభుత్వ వాహనం (సొంతది వాడుకున్నట్లయితే నెలకు రూ. 30 వేల అలవెన్సు), రూ. 15 వేల చొప్పున డీజిల్ కోసం పేమెంట్, ఒక పర్సనల్ సెక్రటరీ, ఒక డాటా ఎంట్రీ ఆపరేటర్, ఇద్దరు సబార్డినేట్లు, ఒక డ్రైవర్‌ను కేటాయించారు.

### వచ్చేది ఏడాదికి రెండుసార్లే..

ప్రత్యేక ప్రతినిధిగా కేఎం సాహ్ని సంవత్సరానికి రెండుసార్లు మాత్రమే భవన్‌ను సందర్శిస్తారు. రాష్ట్ర ఆవిర్భావ వేడుకల రోజు (జూన్ 2), ఆ తర్వాత పంద్రాగస్టు సెలబ్రేషన్స్ కు మాత్రమే హాజరవుతారు. ఢిల్లీ తెలంగాణ భవన్‌లో టూరిజం, లా డిపార్టుమెంటు, ఇంజనీరింగ్ సెక్షన్.. ఇలాంటివన్నీ ఉన్నా వాటి పనితీరుపై సమీక్షలే ఉండవు. కాంట్రాక్టు/ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేసేవారి కుటుంబ సభ్యులే వేర్వేరు విభాగాల్లో పైరవీలతో పోస్టులు సంపాదించుకున్నారనే ఆరోపణలు చాలా కాలంగా ఉన్నాయి. కేంద్రంలోనూ కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వాల మధ్య లైజనింగ్ కోసం ఢిల్లీలోని తెలంగాణ భవన్ ఫంక్షనింగ్‌ను కట్టుదిట్టం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తున్నది.

# జూబ్లీ బస్ స్టేషన్ వద్ద ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఆకస్మిక తనిఖీలు...

- జూబ్లీ బస్ స్టేషన్ నుంచి వెళ్లే ప్రయాణికులతో మాట్లాడిన సజ్జనార్

**తెలంగాణ వీణ/హైదరాబాద్:** తెలంగాణలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి తీసుకు వచ్చింది. అమలు తీరును పరిశీలించేందుకు గాను ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ ఆకస్మిక తనిఖీలు చేశారు. హైదరాబాద్‌లోని జూబ్లీ బస్ స్టేషన్ వద్ద ఆయన సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఉచిత బస్సు ప్రయాణ అమలు తీరును పరిశీలించారు. జూబ్లీ బస్ నుంచి జనగామ, ప్రజ్ఞాపూర్, బాన్సువాడకు వెళ్లే ఎక్స్‌ప్రెస్ బస్సులలో మహిళా ప్రయాణికులతో ముచ్చటించారు. ఆ తర్వాత జేబీఎస్-వెంకటరెడ్డి నగర్, సిటీ ఆర్డినరీ బస్సులో మెట్టుగూడ వరకు ప్రయాణించారు. మహిళా ప్రయాణికులకు జీరో టిక్కెట్ అందించారు.ఈ సందర్భంగా



సజ్జనార్ మాట్లాడుతూ.. ఉచిత బస్సు ప్రయాణానికి మంచి స్పందన వస్తోందన్నారు. మహిళలు, బాలికలు, విద్యార్థినులు, థర్డ్ జెండర్లు ఈ పథకాన్ని వినియోగించుకోవచ్చునని సూచించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఆర్టీసీని భాగస్వామ్యం చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణంపై 40వేల మంది సిబ్బందికి అవగాహన కల్పించినట్లు చెప్పారు. పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరి, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో ప్రయాణించే మహిళలు స్థానికతను నిర్ధారించుకునేందుకు ఆధార్ కార్డును చూపించి సంస్థకు సహకరించాలని కోరారు.ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యంతో రద్దీ పెరిగిందని, అందుకు అనుగుణంగా ప్లాన్ రూపొందించుకున్నట్లు తెలిపారు. ఏవైనా పొరపాట్లు జరిగితే ఆర్టీసీ అధికారుల దృష్టికి తీసుకు రావాలన్నారు. 24 గంటలు అందుబాటులో ఉండే 040-69440000, 040-23450033 నెంబర్లకు ఫోన్ చేయవచ్చునని సూచించారు.

# సింగరేణిలో ఎన్నికల సందడి

- ఈ నెల 27న పోలింగ్ నిర్వహణకు ఏర్పాట్లు
- ఓటు వేయనున్న 39,748 మంది కార్మికులు
- పోలింగ్ కోసం 84 కేంద్రాల ఏర్పాటు

**తెలంగాణ వీణ/హైదరాబాద్ :** సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల సందడి మొదలైంది. ఈ నెల 27న ఎన్నికలు జరగనుండగా అందుకు సంబంధించిన ప్రక్రియ ఊపందుకుంది. ఈ ఎన్నికల్లో 11 ఏరియాల్లో 39,748 మంది కార్మికులు ఓటుహక్కును వినియోగించుకోనున్నారు. టీబీజీకేఎస్, బీఎంఎస్, ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయూ, హెచ్ఎంఎస్, ఇఫ్టూ వంటి సంఘాలు పోటీపడుతున్నా, ప్రధాన పోటీ మాత్రం టీబీజీకేఎస్, కొన్ని జాతీయ కార్మిక సంఘాల మధ్యే ఉంది. రాష్ట్రంలో కాంగ్రెస్, సీపీఐ మధ్య పొత్తు ఉన్నప్పటికీ వీటి అనుబంధ కార్మిక సంఘాలైన ఎన్‌ఐటీయూసీ, ఏఐటీయూసీ వేర్వేరుగా ఎన్నికల్లో పోటీచేస్తున్నాయి.ఇదిలా ఉండగా, కొన్ని సంఘాలు కోర్టుకు వెళ్లి ఎన్నికలను వాయిదా వేయించే ప్రయత్నాలు చేస్తున్నట్టు వార్తలు వినిపిస్తున్నాయి. గతంలో ఈ పనిచేసిన సంఘాలే మళ్లీ రంగంలోకి దిగినట్టు తెలుస్తున్నది. సింగరేణిలో బలమైన టీబీజీకేఎస్‌కు ప్రస్తుతం అనుకూల పరిస్థితులు ఉన్నాయి. కార్మికులకు లబ్ధి చేకూర్చే 60కి పైగా డిమాండ్లను సాధించడం, వారసత్వ ఉద్యోగాలు వంటి అనేక విజయాలను టీబీజీకేఎస్ సాధించింది. గత రెండు ఎన్నికల్లో అన్ని చోట్లా టీబీజీకేఎస్ విజయం సాధించింది. ఈసారి కూడా దానికే విజయావకాశాలు పుష్కలంగా ఉన్నట్లు తెలుస్తోంది . కాగా జాతీయ కార్మిక సంఘాలు కార్మికుల విశ్వాసాన్ని చూరగొనలేక పట్టు కోల్పోయాయి. ఇక ఎన్నికలను వాయిదా వేయించి, బలం



పుంజుకున్న తర్వాత ఎన్నికలను ఎదుర్కోవాలన్న ఆలోచనలో ఉన్నట్టు కార్మికవర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతున్నది. అంతేకాక , మరో ఒకటి రెండ్రు రోజుల్లోనే కోర్టుకు వెళ్లే అవకాశం ఉందని కూడా చెప్తున్నారు.

### 84 పోలింగ్ కేంద్రాలు

ఎన్నికల నిర్వహణకు కార్మికశాఖ అన్ని ఏర్పాట్లు చేస్తున్నది. దీంతో పోలింగ్ కోసం వివిధ ప్రాంతాల్లో మొత్తం 84 కేంద్రాలు ఏర్పాటు చేయనున్నది. కార్పొరేట్ ఏరియాలో ఐదు, కొత్తగూడెంలో ఆరు, ఇల్లెందులో మూడు, మణుగూరులో ఏడు, రామగుండం-1లో 11, రామగుండం- 2లో ఆరు, రామగుండం- 3లో ఆరు, భూపాలపల్లిలో 9, బెల్లంపల్లిలో 5, మందమర్రిలో 11, శ్రీరాంపూర్ లో 15 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. ఇక పోలింగ్ రోజు రాత్రే ఓట్లను లెక్కిస్తారు. ఇందుకోసం 12 ఓట్ల లెకింపు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్టు కార్మికశాఖ తెలిపింది.